

## గ్రామైక్య సంఘంలో అవినీతి బాగోతం!

● వీవోఏ చేతివాటం.. సభ్యుల గగ్గోలు ● వలేటివారిపాళెంలో వెలుగులోకి.. ● కందుకూరు ఎమ్మెల్యే వద్ద పంచాయితీ, పూర్తిస్థాయి విచారణకు ఆదేశం ● ప్రాథమిక విచారణలో రూ.10 లక్షలపైనే అవినీతి జరిగినట్టు సమాచారం

8 లో..


సంగం బ్యారేజీ వద్ద...


సోమశిల జలాశయం నుంచి దిగువన పెన్నా నదిలోకి పరవళ్లు తొక్కుతున్న వరద


నెల్లూరు బ్యారేజీ వద్ద...

# పెన్నమ్మ పరవళ్లు!

● 'సోమశిల'లో ఇప్పటికే 2 గేట్లు ఎత్తి నీటి విడుదల
● నదిలో ప్రవహిస్తున్న వరద
● రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తత
● తీర ప్రాంతవాసులకు హెచ్చరికలు జారీ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న కృష్ణా జలాలు, వరదతో పెన్నమ్మ పరవళ్లు తొక్కుతోంది. నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం నుంచి ఇప్పటికే రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంకు వచ్చే ప్రవాహం 20వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెరుగుతూ.. తగ్గుతూ కొనసాగుతోంది. ఈ క్రమంలో కడప, కర్నూలు, అనంతపురంతోపాటు తూర్పుకనుమలు, వెలుగొండ అడవుల్లో వర్షం కురిస్తే ప్రవాహం భారీగా ఉండవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఇక శ్రీశైలంకు ఎగువ జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి కూడా భారీ వరద కొనసాగుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ నుంచి రాయలసీమ జిల్లాల మీదుగా సోమశిలకు నీరు ప్రవాహం వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలు, శ్రీశైలం జలాలతో రాయలసీమలో ఇప్పటికే అక్కడ అవసరాల మేరకు నీటి లభ్యత చేకూరింది. ఇక వరద నేరుగా సోమశిల డ్యాంకు రానుండగా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో పెన్నాతీర గ్రామాల ప్రజలను నదిలోకి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పశువులు మేతకు పంపవద్దని, అలాగే ఇసుక ట్రాక్టర్లు నదిలో వెళ్లకుండా జాగ్రత్త చర్య లు తీసుకొన్నారు. కాగా, ప్రస్తుతం డ్యాంకు


- మిగతా 7లో..

పారాహుషార్..
కోవూరు : పోతిరెడ్డిపాలెం సమీపంలో తహసీల్దారు సుబ్బయ్య పర్యవేక్షణ



అరెరె.. బుచ్చిరెడ్డిపాలెం : మినగల్లు రీచ్‌లో వరదలో కూరుకుపోయిన ట్రాక్టర్





## తెల్లవారే వరకూ రిస్క్యూ ఆపరేషన్!

పెన్నాలో చిక్కుకున్న 17 మందిలో 9 మంది ఒడ్డుకు..
మిగిలిన 8 మంది గమ్యస్థానాలకు చేరి ఉంటారని అంచనా
రాత్రంతా పెన్నాలోనే గడిపిన అధికారులు, పోలీసులు

6లో..

తేలనంటున్న

'హౌసింగ్'లో పక్కదారి పడుతున్న విచారణ?

# 'గూడు' పురాణి!

పేదల ఇళ్ల మాటున గతంలో జరిగిందే పెద్ద మాయ అనుకుంటే.. ఇప్పుడు అంతకుమించి పరిస్థితులు మారిపోతున్నాయి. అక్రమాలను నిగ్గు తేల్చే క్రమంలో హౌసింగ్ శాఖ అనుసరిస్తున్న తీరు అనేక అనుమానాలు, విమర్శలకు తావిస్తోంది. విజిలెన్స్ విభాగం జరిపిన విచారణలో జిల్లాలో రూ.110 కోట్ల వరకూ ప్రజాధనం దుర్వినియోగమైనట్లు తేల్చింది. అయితే హౌసింగ్ శాఖ సొంతంగా చేసిన విచారణలో కేవలం రూ.16 కోట్లు మాత్రమే అవినీతి జరిగినట్లు సమాచారం. ఈ రెండు శాఖల విచారణ మధ్య సుమారు రూ.వంద కోట్ల తేడా కనిపిస్తోంది. మరి ఆ సొమ్మంతా ఎక్కడికి పోయింది!? నిజంగా ఖర్చు చేసి ఉంటే ఆ మేరకు ఎందుకు ఇళ్లు పూర్తి కాలేదు? ఒకవేళ ఇళ్లకే ఖర్చు చేసి ఉంటే విజిలెన్స్ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చారా!? లేదా హౌసింగ్ అధికారులే తప్పించుకునేందుకు అవినీతిని కప్పిపుచ్చుతున్నారా!? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో జిల్లాలో 82,422 ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న ఇళ్లతోపాటు పేదల లేఅవుట్లలో ఆప్షన్-3 ఇళ్లు కూడా ఉన్నాయి. చాలా లేఅవుట్లలో పేదలకు తెలియకుండానే వారి ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించారు. కొన్ని ఇళ్లు అసలు నిర్మించకుండా బిల్లులు తినేయగా, మరికొన్ని ఇళ్లను తూతూమంత్రంగా కట్టి పేదల సొమ్మును కాంట్రాక్టర్లు దిగమింగారు. నాడు హౌసింగ్ అధికారులు కూడా సహకరించినట్టు సమాచారం. అధికారుల లెక్కల ప్రకారం 26,707 ఇళ్లను పూర్తి చేయగా, అందులో 80శాతం ఇళ్లలో నివాసం ఉండడం లేదని అంచనా. ఈ అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. కొన్ని నెలల పాటు హౌసింగ్ అధికారులు జిల్లాలోని అన్ని లేఅవుట్లు, ఇళ్లను నేరుగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సుమారు రూ.110 కోట్లు లెక్కకు మించి కాంట్రాక్టర్లకు చెల్లించారని గుర్తించారు. ఇందుకు బాధ్యులుగా ఏకంగా 365 మంది అధికారులను చేర్చారు. వారిలో హౌసింగ్ శాఖకు చెందిన పీడీ నుంచి ఏఈ స్థాయి వరకూ 71 మంది, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు. ఒకరకంగా అప్పట్లో జిల్లాలో పనిచేసిన హౌసింగ్ అధికారులందరికీ ఈ కుంభకోణంలో పాత్ర ఉన్నట్లు విజిలెన్స్ విచారణ స్పష్టం చేస్తోంది.

'విజిలెన్స్'లో తేలిన అవినీతి రూ.110 కోట్లు
తాజాగా హౌసింగ్ విచారణలో తేలింది రూ.16 కోట్లు
ఇంత తేడా ఎలా వచ్చిందో!?
విజిలెన్స్ నివేదికను బుట్టదాఖలు చేస్తున్న హౌసింగ్ శాఖ

**● హౌసింగ్ విచారణలో రూ.16 కోట్లు**

విజిలెన్స్ నివేదికను ప్రభుత్వం హౌసింగ్ శాఖకు పంపింది. కానీ ఈ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు హౌసింగ్ శాఖ చేపట్టలేదు. దీనిని బుట్టదాఖలు చేస్తూ సొంతంగా మరోసారి విచారించాలని నిర్ణయించి అందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆప్షన్-3 ద్వారా జిల్లాలో నిర్మించిన ఇళ్ల పురోగతి వివరాలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయించేలా కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఆప్షన్-3 కింద కేటాయించి వివిధ దశల్లో ఉన్న 28,826 ఇళ్లను హౌసింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నిర్మాణం ఏ దశలో ఉంది? సిమెంటు, స్టీలు, డబ్బులు ఎంత తీసుకున్నారు..? వంటి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ విచారణ లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 6500 ఇళ్లకు సంబంధించి తేడాలున్నట్లు తేల్చారు. ఆ విలువ సుమారు రూ.16 కోట్లు ఉంటుందని లెక్కగట్టినట్లు సమాచారం. ఈ లెక్కలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. విజిలెన్స్ విచారణతో పోలిస్తే భారీగా వ్యత్యాసం ఉండటం గమనార్హం. నాడు విజిలెన్స్ అధికారులు అభియోగం మోపిన ప్రతి అధికారి, ఉద్యోగికి వారు చేసిన తప్పులను లెక్కలతో సహా చూపిస్తూ నోటీసులు ఇచ్చారు. అటువంటప్పుడు ఇంత తేడా ఎందుకు వచ్చిందన్నది అనుమానంగా మారింది. కాగా ఈ అంశంపై జిల్లా హౌసింగ్ అధికారులను సంప్రదించగా, ప్రత్యేక యాప్ ద్వారా విచారణ జరిపిన మాట వాస్తవమేనని, కానీ ఎంత మేర అవకతవకలు తేలాయన్న విషయం మాత్రం తమకు తెలియదని సమాధానమిచ్చారు.

ఇంజనీరింగ్ శాఖల్లో అంతా ఇన్‌చార్జులే..! కానరాని పర్యవేక్షణ ● అభివృద్ధి పనుల్లో కొరవడుతున్న నాణ్యత 8లో..



## ముగిసిన కలెక్టర్ల సదస్సు

● రెండో రోజు పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు మంగళవారం ముగిసింది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రెండో రోజు కలెక్టర్ హిమాన్షు శుక్లాతోపాటు ఎస్పీ అజిత వేజండ్ల కూడా పాల్గొన్నారు. వివిధ శాఖలపై సమీక్ష జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. వాటికి అనుగుణంగా జిల్లాల్లో పనితీరు కనిపించాలని ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులు కలెక్టర్, ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నుంచి కలెక్టర్, ఎస్పీలు జిల్లాలో అందుబాటులో ఉండనున్నారు.




# అతివల ఆరోగ్యంపై ఫోకస్

● నేటి నుంచి ప్రత్యేక స్క్రీనింగ్ ● స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పేరుతో పరీక్షలు ● గుండె, క్యాన్సర్ వ్యాధులకు సైతం ఉచిత చికిత్సలు ● అక్టోబరు 2 వరకు నిర్వహణ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమా నికి శ్రీకారం చుట్టాయి. మహిళ-శక్తివంతమైన కుటుంబం(స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్) పేరుతో బుధవారం నుంచి దీనిని అమలు చేయనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ అన్నీ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, చికిత్స చేసేలా కార్యాచరణ రూపొందించాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ శిబిరాల ద్వారా స్క్రీనింగ్ జరగనుంది.

**● 591 ప్రభుత్వ ఆసుపత్రుల ఎంపిక**

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా స్క్రీనింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 591 ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేశారు. మొదటి రోజు 117 ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత ప్రతీ రోజు 60 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారో ముందుగా మహిళలకు తెలిసే విధంగా గ్రామాల్లో టాంటాం వేస్తారు. వైద్య ఆరోగ్యశాఖతోపాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్, పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



**పరీక్షలు.. చికిత్సలు ఇలా..**

● మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
● మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనత గుర్తించి తగిన చికిత్సలు అందిస్తారు.
● గర్భవతులకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
● పిల్లలు, గర్భిణుల్లో అవసరమైన వారికి వ్యాధినిరోధక టీకాలు వేస్తారు.
● యుక్త వయసు బాలికలకు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.
● రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

**సద్వినియోగం చేసుకోవాలి**

స్క్రీనింగ్ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఈ శిబిరాల్లో పలు రకాల వ్యాధులకు చెందిన వైద్య నిపుణులు కూడా పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారు. నెల్లూరులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

## నేటి నుంచి వైద్యశిబిరాలు

మనుబోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేటినుంచి గ్రామాల్లో మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో 'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' పథకం కింద వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గేయపూజిత తెలిపారు. మంగళవారం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, శిబిరాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**బంగారం, వెండి ధరలు**

| బంగారం (22 క్యారెట్లు) | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 10568 |
| వెండి కిలో ధర | రూ. 133800 |
| వెండి ఒక గ్రాము | రూ. 136.80 |

### సకాలంలో పనులు పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గందళ్ల శంకరయ్య అధ్యక్షతన జరిగింది. డిప్యూటీ ఎంపీడీవో పెంచలశ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు అబివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కైలాసం లావణ్య, అద్దంకి మమత, డిప్యూటీ తహసీల్దారు గోపీకృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు ఘన సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న నాయకులు

మనుబోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న ఇద్దరు ఉద్యోగులను మంగళవారం ఘనంగా సత్కరించారు. 11 నెలల క్రితం డిప్యూటీ ఎంపీడీవోగా నారాయణ బాధ్యతలు చేపట్టారు. ఆయన పదోన్నతిపై ఎంపీడీవోగా బాలాయపల్లి మండలానికి వెళ్ళనున్నారు. అలాగే ఐదేళ్ళుగా కొమ్మలపూడి కార్యదర్శిగా పనిచేస్తున్న పవన్ విజయవాడలో వైద్యశాఖలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగం రావడంతో ఆయన బదిలీపై వెళ్ళనున్నారు. వీరిని ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్యలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా, కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి ఎంపీడీవో బదిలీ.. సత్కరించిన సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఓజిలి ఎంపీడీఓగా వెళుతున్న నారాయణరెడ్డిని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు ఘనంగా సత్కరించారు.

### రాపూరులో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రేయ

రాపూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ పర్యవేక్షణలో రాపూరులోని షాదీ మంజిల్ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ శ్రేయ ఆధ్వర్యంలో 150 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామ నాయుడు, ట్రస్ట్ ఏఓ కృష్ణ గల్లా, అరవింద్ నేత్రాలయ సిబ్బంది జీవన్, రాపూరు షాదీ మంజిల్ సభ్యులు అహ్మద్ పాల్గొన్నారు.

### సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరికలు

మనుబోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపేట పంచాయతీలో టీడీపీ నాయకులు ఏకొల్లు కోదండరామిరెడ్డి, అమీబాషా ఆధ్వ ర్యంలో వైసీపీని వీడి 36 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నెల్లూరులోని తన పార్టీ కార్యాల యంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, అక్కంపేట టీడీపీ యువ నాయకుడు ఇనమడుగు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

పొదలకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠ శాలలో మంగళవారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెలక్షన్స్ నిర్వహించారు. రగ్బీలో 200 మంది పాల్గొ న్నారు. అండర్ -14, అండర్ - 19 విభాగా లలో బాలుర, బాలికలను ఎంపిక చేశారు. హెచ్‌ఎంలు సురేష్, శైలజ, సెక్రటరీ దేవిక, రమణయ్య, ఎంఈవోలు రేణుక, శోభనాద్రిలు పాల్గొన్నారు.

# కొత్త కోర్సులు.. సరికొత్త అవకాశాలు!

**ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రణాళిక**

**ఆధునిక టెక్నాలజీతో ఉపాధి**

**వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు**



విక్రమ సింహపురి యూనివర్సిటీ

వెంకటాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నేటి విద్యార్థులే రేపటి ఉద్యోగులు. అందుకే.. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా విక్రమ సింహపురి యూనివర్సిటీ నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా, పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని 2024 - 2025 విద్యా సంవత్సరం నుంచి నూతన స్వయం ఆధారిత (సెల్ఫ్ ఫైనాన్స్) కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కోర్సులు పూజు విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో ఎంతోగానో దోహదపడ తాయి. ఆ దిశగా ఆధునిక టెక్నాలజీతో కూడిన సరికొత్త కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పక్కా ప్రణాళికతో నిబద్ధతగా కృషి చేస్తున్నారు.

**- ఆధునిక కోర్సులతో బంగారు భవిత**

ప్రస్తుతం వీఎస్‌యూలో 27 పీజీ కోర్సులు, 5 డిగ్రీ హానర్స్, 3 డిగ్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ ఇంటిగ్రేటెడ్ బయోఇన్ఫర్మాటిక్స్, డిగ్రీ ఇంటిగ్రేటెడ్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ అప్లైడ్ ఫిజిక్స్, బీబీఏ ఆనర్స్ లాజిస్టిక్స్, బీఎస్సీ ఆనర్స్ గణితం, ఎంపీఈడీ ఫిజికల్ ఎడ్యుకేషన్, మెరైన్ బయాలజీ వంటి కొత్త కోర్సులను వీఎస్‌యూలో ప్రవేశపెట్టారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాలలో విస్తృతంగా ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. విద్యార్థులు కూడా ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్మార్ట్ బోర్డులతో కూడిన ఆధునిక తరగతి గదులు ఏర్పాటు చేశారు. వీటితోపాటు హైస్పీడ్ ఇంట ర్నెట్ యాక్సెస్‌తో కంప్యూటర్లు అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు కంప్యూటర్ సెంటర్‌లో టెక్నికల్ సపోర్ట్, వైఫై యాక్సెస్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

**- మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి**

వీఎస్‌యూలో ఉన్న విభాగాలను బలోపేతం చేయడంతోపాటు నూతన విభాగాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఆధునిక బోధనా పద్ధతులను అందించాలనే లక్ష్యంతో తరగతి గదులను స్మార్ట్ క్లాస్ రూములుగా మార్చడంతోపాటు డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రత్యేక దృష్టి సారించారు.

**- పరిశోధన రంగాలలో సహకారం**

వీఎస్‌యూ ఇతర యూనివర్సి టీలు, సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. తద్వారా విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన ప్రాజెక్టులలో పాలుపంచుకో వడానికి, నూతన విషయాల అధ్యయనానికి అవకాశం లభిస్తుంది. ఇప్పటికే పలు యూనివర్సిటీలు, సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్థలతో ఒప్పం దాలు కుదుర్చుకునే అవకాశం ఉంది.

**వీఎస్‌యూ అభివృద్ధికి శాయశక్తులా కృషి**



యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నాం. సమగ్రాభివృద్ధి దిశగా వీఎస్‌యూను ముందుకు తీసుకువెళుతున్నాం. అందులో భాగంగా స్మార్ట్ క్లాస్ రూమ్స్ నుంచి పరి శోధన ఫెలోషిప్‌ల వరకు విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చి దిద్దాం. వీఎస్‌యూలో ప్రవేశపెట్టిన నూతన కోర్సులు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక సాంకేతికతతో కూడిన సౌకర్యాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. వర్సిటీని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

- వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

## రైతుల చేతుల్లోనే ప్రజల ఆరోగ్యం

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలో రూ.1.08 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఒక్కో యూరియా బస్తా రూ.2 వేలు నుంచి రూ. 2600 వరకు ఉంటుందన్నారు. ఆ ధరలో ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ భరించి రైతులకు రూ.266.50కే అందజేస్తోందన్నారు. నానో యూరియా వాడకంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక బస్తా యూరియా వాడకాన్ని తగిస్తే రూ.800 రుపాయలను నేరుగా రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులందరూ వీలైనంత వరకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రుపాయలతో నిర్మించిన మురుగు కాలువలు నిరుపయోగమన్నారు. ఎంపీడీఓ కల్పన, సర్పంచ్ రాములమ్మ, నాయకులు కుం కాల దశరథ, నాగేంద్ర ప్రసాద్, బొమ్మి సురేం ద్ర, కట్టంరెడ్డి రాధాకృష్ణా రెడ్డి, రాధాకృష్ణమ నాయుడు, నాగార్జున్ రెడ్డి, రమేష్ నాయుడు, దొడ్ల అశోక్, కుంచె రమేష్, మధు రెడ్డి, కుం కాల శీనయ్య, ఉప్పలపాటి మణి పాల్గొన్నారు.

### వరదలో ఇసుక ట్రాక్టర్.. డ్రైవర్‌కు తప్పిన ప్రాణాపాయం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి మినగల్లు ఇసుక రీచ్‌లోనుంచి కొంతమంది ట్రాక్టర్లకు ఇసుక లోడు చేస్తుండగా పెన్నానదికి వరద ప్రవాహం ఎక్కువైంది. గమనించిన ట్రాక్టర్ల డ్రైవర్లు అప్రమత్తమై ట్రాక్టర్లును బయటకు తరలించేయగా ఓ ట్రాక్టర్ మాత్రం వరదలో చిక్కుకుంది. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్‌ను వదిలేసి పరుగులు తీయడంతో ప్రాణా పాయం తప్పింది. ఈ విషయం మంగళ వారం ఉదయం పలువురు ట్రాక్టర్ల డ్రైవర్లలో చర్చనీయాంశం కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రవాహంలో చిక్కుకున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన రమేష్ అని తెలిసింది.

### డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లకు ఓటీపీ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలంటూ బుచ్చిరెడ్డిపాళెంలో డాక్యుమెంటరీ రైటర్లు పెన్‌డౌన్ చేశారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కొత్త విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ సభ్యులతో నిరసన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు ప్రసాద్, శీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు వీరంపల్లి విద్యార్థినులు

మనుబోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్‌లో భాగంగా పొదలకూరులో మంగళవారం రగ్బీ పోటీలు నిర్వహించారు. వీరంపల్లి ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు ఎం. నిత్య, ఏ. హేమశ్రీ, జీ మనోజ, కే వైష్ణవి, టీ శ్రీజ పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో 5 మంది బాలికలు అండర్-14, అండర్-17 విభాగాల్లో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక య్యారు. వీరంతా వచ్చే నెలలో జరగబోయే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో ఆడనున్నట్లు వీరంపల్లి పాఠశాల పీడీ ఎన్. శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం కాంతారావు, తెలుగు పండిట్ సోమా పద్మారత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

### వీఎస్‌యూలో అంతర్జాతీయ సదస్సు

వెంకటాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం పర్యావరణ కాలుష్యం, పోషణ, ప్రజారోగ్యంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇలాంటి సమస్యలను ఎదుర్కోవడానికి శాస్త్రీయ పరిశోధనలు, అంతర్జాతీయ సహకారం అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రొఫెసర్ పీ చంద్రమౌళి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, ఎల్ వీరాంజనేయరెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి వరద జలాలను పెన్నానదికి విడుదల చేసిన నేపథ్యంలో పొదలకూరు మండలంలోని పెన్నానది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు బీ శివకృష్ణయ్య సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విరువూరు సమీపంలోని సంగం బ్యారేజీ నుంచి సుమారు 30 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతుండడంతో పెన్నా తీర ప్రాంతాలైన విరువూరు, మహమ్మదాపురం గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు నది వైపు వెళ్లవద్దన్నారు. సూరాయపాలెం గ్రామ రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలోకి ఇసుక కోసం ఎవరూ వెళ్లే సాహసం చేయవద్దని సూచించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్‌వోలు, వీఆర్‌ఏలకు సూచించారు.

**కోవూరు:** పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తున్నందున నదిలోకి దిగవద్దని తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య మంగళవారం పెన్నాపరీవాహక గ్రామాల ప్రజల్ని హెచ్చరించారు. పోతిరెడ్డిపాళెం సమీపంలోని నడవను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్థానికులకు పలు సూచనలు చేశారు. సోమశిల నుంచి 35,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందు వల్ల ప్రవాహం రెండు రోజులు కొనుసాగుతుందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా కోరారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న స్టేట్ జాయింట్ డైరెక్టర్ రమేష్‌బాబు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే 'స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ఏర్పాట్లు, శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యాలపై దృష్టి సారించాలని తెలిపారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్‌కుమార్, కన్సల్టెంట్ రామ్మోహన్, టీబీ కో ఆర్డినేటర్ ఈ శ్రవణ్‌కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న టీఎన్ ప్రసాద్‌నాయుడు

### విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

రాపూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ తిరుపతి పార్లమెంటు వాణిజ్య ప్రధాన కార్యదర్శి టీఎన్ ప్రసాద్ నాయుడు సొంత నిధులతో మండలంలోని కండలేరు డ్యాం హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు క్రీడా పరికరాలు అందించారు. మంగళవారం కండలేరు ఉన్నత పాఠశాలకు రూ.30 వేలు విలువ చేసే క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలన్న ఉద్దేశంతో క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు భారతి, అధ్యాపకులు శివాజీ, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

**పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ రామకృష్ణయ్య అసంతృప్తి**



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

మనుబోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరమ్ లేక వాయిదా పడింది. దీనిపై మనుబోలు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ పొన్నూరు రామకృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యురాలు గుండాల శిరీష అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో 19 పంచాయతీలకు గాను 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. సర్వసభ్య సమావేశం జరగాలంటే కనీసం 6మంది ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాల్సి ఉంటుంది. అయితే కేవలం నలుగురు మాత్రమే రావడంతో కోరమ్ లేదని ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా వచ్చే వారానికి వాయిదా వేశారు. దీంతో అన్నిశాఖల అధికారులు వెనుదిరిగారు. దీనిపై పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు రాకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు వినిపించేందుకు మిమ్మల్ని ప్రజలు ఎన్నుకుంటే, ఏదో జీతాలు రాలేదనో, ఇతర కారణాల వల్ల సమావేశాలకు రాకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మలపూడి ఎంపీటీసీ సభ్యురాలు గుండాల శిరీష, టీడీపీ నాయకులు సాని వెంకటరమణయ్య, సర్వేపల్లి శివకుమార్ శర్మ, శివుడు రాజాగౌడ్, రావుల జితేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**తెల్లవారే వరకూ**

## పెన్నాలో రిస్క్యూ ఆపరేషన్!

- వరదలో చిక్కుకున్న 17 మందిలో 9 మంది ఒడ్డుకు..
- 8 మంది గమ్యస్థానాలకు చేరి ఉంటారని అంచనా
- రాత్రంతా పెన్నాలోనే గడిపిన అధికారులు, పోలీసులు



పెన్నాలోని ఇసుక దిబ్బలో ఉన్న వారిని నిచ్చెన ద్వారా ఒడ్డుకు చేర్చుతున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదిలో చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకు వచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, అగ్నిమాపక దళం రాత్రి నుంచి తెల్లవారేవరకు శ్రమించారు. వరదలో చిక్కుకుపోయిన 17 మందిలో 9 మందిని ఒడ్డుకు చేర్చగా, మిగిలిన 8 మంది క్షేమంగా ఇళ్లకు చేరి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. సోమవారం సాయంత్రం పేకాట ఆడేందుకు, మద్యం సేవించేందుకు నగర శివార్లలోని భగత్ సింగ్ కాలనీ సమీపంలోని పెన్నా నదిలోని ఇసుక దిబ్బల్లోకి వెళ్లారు. అయితే, పెన్నా బ్యారేజీలో గేట్లు తెరవడంతో ఒక్కసారిగా నీరు ఉప్పొంగాయి. దీంతో 17 మంది మందుబాబులు, పేకాట రాయుళ్లు నీటిలో ఇరుక్కుపోయారు.

**● 112కు సమాచారం**

నీటిలో చిక్కుకుపోయిన వారు రాత్రి 8.50 గంటలకు 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నా స్టేషన్‌కు చేరుకొని అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. భగత్‌సింగ్ కాలనీకి సమీపంలో ఉన్న హైవే కింద 17 మంది నీటిలో చిక్కుకున్నారని, త్వరగా రావాలని కోరారు. దీంతో అగ్నిమాపక జిల్లా అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఎఫ్‌వో శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాలతో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందిని వెంటబెట్టుకుని ఘటనాస్థలికి చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి 35 అడుగుల నిచ్చెనను నదిలోకి దించి రోప్‌ల సాయంతో ఆస్కా లైట్‌ను నదిలోకి దింపారు. అనంతరం సీఐ వేణుపాల్‌రెడ్డి సహకారంతో 9మందిని గుర్తించి, వెలుపలకు తీసుకువచ్చారు. మిగిలినవారు క్షేమంగానే బయటకి వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

**● మంత్రి, అధికారుల పర్యవేక్షణ**

పెన్నా నదిలో పలువురు యువకులు చిక్కుకున్నారన్న సమాచారం అందుకున్న మంత్రి నారాయణ వెంటనే జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. నెల్లూరు ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వాకా శ్రీనివాసులరెడ్డి, డీఎస్పీలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు వందల సంఖ్యల్లో పెన్నా వద్దకు చేరుకున్నారు. తెల్లవారుజామున 4.15 గంటల వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.

**● గుర్తించిన వారు..**

మారు మోహన్ (భగత్‌సింగ్ కాలనీ), చిర్రా ప్రభాకర్ (హెచ్ఆర్ పురం), వేమూరు సుమన్ (నాగేంద్రనగర్), బెల్లంకొండ సుభాన్ (కిసాన్‌నగర్), తాజుద్దీన్ (జాకీర్‌హుసేన్ నగర్), మూర్తి (సంతపేట), పగడాల మునికుమార్ (భగత్‌సింగ్‌కాలనీ టిడ్కో గృహాలు), పేరం ప్రవీణ్ (కోవూరు), సతీష్ (చంద్రబాబునగర్ ఏ బ్లాక్).

**● గుర్తించని వారు**

విజయ్, వీరేంద్ర (చంద్రబాబునగర్), ప్రసన్న (నిప్పో సెంటర్), ఏసు (అల్లీపురం టిడ్కో గృహాలు), కోడి (కోవూరు), వెంకటేశ్వర్లు (జాకీర్‌హుస్సేన్ నగర్), విజయ్ (కిసాన్‌నగర్), సాయిబాబాలు నీటిలో నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు.

### పేకాట స్థావరంపై దాడులు

- ఏడుగురి అరెస్టు
- రూ.3160 నగదు స్వాధీనం



అరెస్టు చేసిన పేకాటరాయుళ్లతో పోలీసు సిబ్బంది

పొదలకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వావింటపర్తి గ్రామ శివారులో పేకాట స్థావరంపై కండలేరు డ్యామ్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3160 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## వాగులో పడి బాలుడి మృతి

వరికుంటపాడు (ఉదయగిరి రూర ల్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులను మేపుకునేందుకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం జీ.కొత్తపల్లి శివారు ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం సన్నవారిపల్లికి చెందిన చాగరెడ్డి శ్రీను, లక్ష్మీకాంతమ్మ దంపతులు ఏడాది క్రితం జీ.కొత్తపల్లిలోని తన బావమరిది కుమ్మిత మాల్యాద్రి నివాసానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ, గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వ్యాపార నిమిత్తం మాల్యాద్రి పూణేకు వెళ్లడంతో ఆయన కుమారుడు శివరామ్(15) రోజు మాదిరిగానే పిల్లాపేరు వాగు సమీపంలోకి గేదెలను మేత కోసం తోలుకెళ్లాడు. గేదెలు అవతలి ప్రాంతానికి వెళ్లడంతో వాటి కోసం వెళ్లిన సహచరుడు ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో శివరాం సైతం వాగులోకి దిగి లోతు ఎక్కువగా ఉండడంతో ఒక్కసారిగా మునిగిపోయి మృతువాత పడ్డాడు. అనంతరం ఒడ్డుకు చేరుకున్న సహచరుడికి అతను కనిపించకపోవడంతో భయాందోళనకు గురై గ్రామస్థులకు సమాచారం అందించాడు. గ్రామస్థులు హుటాహుటీనా అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఒడ్డున ఉన్న దుస్తులతో పాటు నీళ్లలో తేలాడుతున్న చెప్పుల ఆధారంగా వాగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించి ఇంటికి తరలించారు.

### నెరవేరిన పిడూరు వాసుల రోడ్డు కల

**● నేడు పనులకు శంకుస్థాపన**

మనుబోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంవత్సరాల తరబడి దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణిస్తూ పిడూరు ప్రజలు అవస్థలు పడేవారు. ఈ రోడ్డు నుంచే మనుబోలు నుంచి పిడూరు, కాగితాలపూరు, లక్ష్మీనరసింహపురం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వం గడిచిన 5 ఏళ్లలో గ్రామానికి రోడ్డు వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు తిక్కవరపు శ్రీధర్ రెడ్డి, వెంకురెడ్డి, ఇతర నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి స్పందించి రూ. 1.20 కోట్ల ఉపాధి నిధులతో పిడూరు గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయించారు. బీటీ రోడ్డు, మధ్యలో వంతెన ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్ పీఆయు ఏఈ సుధాకర్ తెలిపారు. ఈ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలా ధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య తెలిపారు.

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 150 |
| స్కిన్ చికెన్ | 264 |
| స్కిన్‌లెస్ | 290 |
| కోడిగుడ్ల ధర (100): | 560 |



## భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం రాత్రి కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. అమ్మవారికి కాత్యాయనీ అలంకారంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి భక్తులతో వ్రతం చేయించారు. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



## పెన్నా మిలమిల..!

సోమశిల జలాశయం నుంచి విడుదల చేసిన పెన్నా నదీ జలాలు నెల్లూరు నగరానికి చేరుకున్నాయి. వాటిని దిగువకు వదిలిన సందర్భంగా నగరంలోని పెన్నా వంతెనపై విద్యుద్దీపకాంతులు.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## న్యూస్ బాక్స్

### నేటి నుంచి 'స్వచ్ఛతాహీ సేవ'

● నగర కమిషనర్ నందన్



నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలపై కార్పొరేషన్ కమిషనర్ నందన్ సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గంటలకు వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ జరుగుతుందని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి 'స్వచ్ఛతాహీ సేవ'ను జయప్రదం చేయాలని కోరారు.

### 'సిటీ ప్లానింగ్'లో ఇద్దరిపై వేటు

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్‌లోని సిటీ ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై కమిషనర్ నందన్ వేటు వేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిద్దరిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు బయటకు వచ్చాయి. కనకమహల్ సెంటర్ వద్ద అనధికారికంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని ఆపకపోవడం నేపథ్యంలో ఉన్నతాధికారులు జారీ చేసిన షోకాజు నోటీసుకు సమాధానం చెప్పకపోవడం తో టీపీబీవో కే వెంకటేష్, సిటీ ప్లానింగ్ సెక్రటరీ సీహెచ్ శివకుమార్‌పై కమిషనర్ చర్యలు తీసు కున్నారు.

### మహిళను మోసగించిన వ్యక్తిపై కేసు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళను బాగా చూసుకుంటానని నమ్మించి ఆమె వద్ద నగదు తీసుకొని మోసగించిన వ్యక్తిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని బీవీ నగర్‌కు చెందిన ఓ మహిళ భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. పండ్ల షాపు లో పనిచేస్తూ వచ్చిన సంపాదనతో పిల్లల ను పోషించుకుంటోంది. ఆమెకు రెండేళ్ల కిందట నార్తుమోపూరుకు చెందిన సందీప్‌తో పరిచయం అయ్యింది. సందీప్ ఆమెను, ఆమె పిల్లలను బాగా చూసుకుంటానని నమ్మించాడు. దీంతో ఏడాదిన్నరగా ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో సందీప్ సొంతగా ఆటో కనుక్కోవాలని ఆమె వద్ద నుంచి రూ.60 వేలు నగదు తీసుకున్నాడు. కొద్దిరోజుల అనంతరం అతను ఇంటికి రావడం మానేశాడు. ఆమె ఫోన్‌చేసినా తీయకపోవడంతో మహిళ అతని స్వగ్రామానికి వెళ్లి ఆరాతీసింది. అప్పటికే సందీప్‌కు వివాహమై పిల్లలున్నారని తెలిసింది. దీంతో తనను మోసగించిన అతనిపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ మంగళవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పెన్నమ్మ పరవళ్లు!

(5వ పేజీ తరువాయి)

23,234 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో నీటి నిల్వ 73.450 టీఎంసీలుగా ఉంది. దిగువ డెల్టాకు గేట్ల ద్వారా 14,850, పవర్ టన్నెల్ నుంచి 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

● సంగంలో 28 వేల క్యూసెక్కులు

సంగం : పెన్నా బ్యారేజ్ వద్ద మంగళవారం 28 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైంది. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.2 అడుగుల చేరింది. బెజవాడ పాపిరెడ్డి కాలువకు 350 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగతా 27,400 క్యూసెక్కుల నీటిని 26 గేట్ల ఎత్తి దిగువ పెన్నానదికి విడుదల చేస్తున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

## అంకణం రూ.1.50లక్షలు

# ప్రభుత్వ స్థలం అమ్మబడును !

● భగత్‌సింగ్‌కాలనీలో బరితెగిస్తున్న భూ మాఫియా

● టిడ్కో నివాసాల కోసం కొనుగోలు చేసిన ప్రభుత్వం

● ఆ స్థలంలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు

● యథేచ్ఛగా అమ్మకాలు

● అన్నీ తెలిసినా అధికారుల మౌనం

● కొనుగోలు చేసి నష్టపోతున్న అమాయకులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలో ఉన్న భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో జాతీయ రహదారి సమీపాన రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు చెరపట్టారు. దర్జాగా ప్రభుత్వ భూమికే రేటు నిర్ణయించి అమ్మేస్తున్నారు. ఈ భూమిలోనే దుకాణాలు నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మాత్రం ఆక్రమణల తొలగింపునకు ఎందుకో వెనకడుగు వేస్తున్నారు.

ఆక్రమణకు గురవుతున్న భూములను పేదల టిడ్కో నివాసాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసింది. రైతుల వద్ద నుంచి ఎకరాకు రూ.30లక్షలు చెల్లించి కొనుగోలు చేసింది. భగత్‌సింగ్‌కాలనీలోని సర్వే నెంబరు 2222లో సూమారు 4 ఎకరాల భూమి టిడ్కో నివాసాలు నిర్మించ కుండా ఖాళీగా ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో గత వైసీపీ ప్రభుత్వం ఆ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణం చేపట్టింది. మిగతా రెండు ఎకరాలపై స్థానికంగా ఉన్న భూ మాఫియా కన్ను పడింది. దాదాపు 200 అంకణాలను అక్రమించి దుకాణాల నిర్మాణంతోపాటు స్థలాలను విక్రయిస్తున్నారు. అంకణం రూ.1.50 లక్షలుగా నిర్ణయించి మరీ అమ్ముతున్నారు. ఆక్రమిత స్థలాలకు పట్టాలు సైతం పుట్టించినట్లు తెలిసింది. ఈ విషయం తెలియక కొందరు సామాన్య ప్రజలు ఈ భూములను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించి భూ మాఫియాను అరికట్టాల్సిన అవసరం ఉంది.



ప్రభుత్వ స్థలానికి నిర్మించిన ప్రహరీ గోడ

### ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు తొలగిస్తాం

భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో సర్వే నెంబరు 2222లో ఉన్నది మొత్తం ప్రభుత్వ భూమి. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని పూర్తిగా తొలగిస్తాము. గతంలో సైతం అక్రమార్కులను హెచ్చరించాము. ఈ భూములను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. ఈ భూములను ఎవ్వరూ కొనుగోలు చేయరాదు.

- షఫీమాలిక్, అర్బన్ తహసీల్దారు



అక్రమార్కులు అమ్మకానికి పెట్టిన ప్రభుత్వ భూమి



ప్రభుత్వ స్థలంలో దర్జాగా నిర్మించిన దుకాణాలు



## నవరాత్రి హంగులు

ముస్తాబవుతున్న కన్యకాపరమేశ్వరి ఆలయం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబ వుతోంది. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే ఉత్సవాలకు ఆలయం లోపల, బయట, గాలిగోపురాలకు విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. ప్రధాన ఆలయం, అంతరాలయాలను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. వాహనాలు, పల్లకీలు, క్యూలైన్ల బారికేడ్లు, సహస్ర దీపార్చన స్టాండ్లు సిద్ధం చేస్తున్నారు.



## అమ్మవారి ఉత్సవాలకు ఆనంకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 22వతేదీ నుంచి రాజరాజేశ్వరి ఆలయంలో జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలిరావా లని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రిని మంగళవా రం ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కూడా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 14వ డివిజన్‌లో 'ఒక రోజు - ఒకవీధి'



నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 14వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ఒక రోజు - ఒకవీధి' పేరిట కార్పొరేషన్ అధికారులు, సిబ్బందితో పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. వారంలో నాలుగు రోజులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని అన్నీ వీధులను కవర్ చేయనున్నట్లు ప్రతాప్ చెప్పారు. డ్రైనేజీ కాలువల్లో పూడికతీత, రోడ్ల శుభ్రం, వీధిలైట్లతోపాటు ఇతర పనులన్నీ ఆ రోజు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఎంహెచ్‌వో కనకాద్రి పరిశీలించారు.

## యానాదులకు చెక్క రిక్షాల పంపిణీ



నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం లోని డంపింగ్ యార్డులో నివసిస్తున్న 12 మంది చల్లా యానాదులకు బాక్సుటైపు చెక్క రిక్షాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ మల్లి కార్జునరెడ్డి పంపిణీ చేశారు. నగరంలోని ఐటీ డీఏ కార్యాలయంలో మంగళవారం ఈ కార్య క్రమం జరిగింది. పీవో మాట్లాడుతూ దొంతాలి డంపింగ్ యార్డులో జీవిస్తున్న యానాదుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించామని చెప్పారు. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని చెప్పారు.

### తోపుడు బండ్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం) : సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పేద మహిళలకు జీవనభృతి కోసం మంగళవారం తోపుడు బండ్లను పంపిణీ చేశారు. కూరగాయలు, పండ్లు అమ్ముకునే విధంగా తోపుడు బండ్లను తయారు చేయించి అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్- అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాప్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కేబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్‌రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, బి.ప్రసాదరావు-ఏలూరు జేడీ, ఎన్.వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, డి.ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీగా నియమితులయ్యారు.

## ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 17 నుంచి 27వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేరదలచుకున్న ఐటీఐను ఎంపిక చేసుకుని వారికి కేటాయించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. ఈనెల 28న అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి 29న ప్రైవేట్ ఐటీఐలకు, 30న ప్రభుత్వ ఐటీఐల అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

### సేవాభావం భారతీయుల్లో అధికం

● సింగపూర్ డాక్టర్ డామినిక్ కార్లే

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సేవా, త్యాగం భారతీయుల్లో అధికమని సింగపూర్‌కు చెందిన డాక్టర్ ఫర్నీదేజ్ డామినిక్ కార్లే అన్నారు. మంగళవారం కొండాయపాలెం అబైడింగ్ హోప్ ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రస్ట్ చైర్మన్ నిర్మల్ కుమార్ ప్రతినెల 500 మందికి పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ సేవలను సింగపూర్ నుంచి వచ్చిన ఆయన డాక్టర్ అబ్దుల్ కలాం కొనియాడారు.

## వక్ఫ్‌బిల్లుపై సుప్రీం తీర్పు బీజేపీకి చెంప పెట్టు

● ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్




మాట్లాడుతున్న ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి చెంపపెట్టని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని ఇన్సాఫ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారం లోకి వచ్చిన తర్వాత ముస్లింలకు నష్టం కలిగించే ఎన్నో చట్టాలను తీసుకువచ్చిందన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, ఎన్ఆర్‌సీ, గోరక్షణ పేరు తో ముస్లింలను చంపారని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బిల్లుపై సుప్రీం తీర్పు హర్షణీయమన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు లతీఫ్ అహ్మద్, వెంకటేశ్వర్లు, మున్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



## కీటక జనిత వ్యాధులు ప్రబలనివ్వొద్దు

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల కేసులు నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వైరల్ జ్వరాలు నమోదవుతున్న దృష్ట్యా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, పలువురు సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.





## అయ్యో.. అంబాపురం చెరువు


నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటోలో కనిపిస్తున్నది మురికి గుంట కాదు పంట కాలువ!. కనుపూరు కాలువ నుంచి అంబాపురం చెరువుకి నీటిని సరఫరా చేసే కాలువ ఇది. దీని వెడల్పు కట్టలతో కలిపి నలబై అడుగులు. అయితే రెండు వైపుల కాలువ కట్టలు ఆక్రమణకుగురై శాశ్వత కట్టడాలు వెలిశాయి. దీంతో కాలువ పూడిక పనులు చేయడం కష్టంగా మారింది. ఈ కారణంగా కాలువ మురికి గుంటగా, కొత్తూరు ప్రజలకు దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది.



మురికిగుంతలా మారిన అంబాపురం కాలువ

## డీకేడబ్ల్యూ కళాశాలలో రక్తదాన శిబిరం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రెడ్ క్రాస్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టీ గిరి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థినులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ టీ శ్రీరంజని, సభ్యులు డాక్టర్ సీహెచ్ రమాదేవి, హెచ్ స్వాతి, టీ మమత, ఎస్ ప్రియాంక పాల్గొన్నారు.



## చీకట్లో జలనిధి..!

జిల్లా జలనిధి సోమశిల జలాశయం వద్ద రాత్రయితే చీకటి అలముకుంటోంది. ఉన్న దీపాలు వెలగక.. కీలక ప్రాంతాల్లో దీపాలు లేక అంధకారం కమ్ముకుంది. దీంతో ఇక్కడ జలాశయం వుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది.. ఇదిలా ఉంటే ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండగా దిగువకు గేట్లు ఎత్తి నీరు సరఫరా చేస్తున్న పరిస్థితి. ఇలాంటి సమయంలో కూడా ఇంజనీర్లలో చలనం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకొనే సౌలభ్యం ఉన్నా.. ఆ దిశగా చర్యలు కరువయ్యాయి. వచ్చామా? వెళ్లామా? జీతం తీసుకున్నామా? అనే ధోరణి అధికారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



## బంతీ.. పూబంతీ...!

కోవూరు మండల పరిధిలోని గంగవరం గ్రామ పొలిమేరల్లో రైతులు సాగు చేస్తున్న బంతి పూల తోటలు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. కోవూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వెళ్ళే మార్గంలో బంతిపూల సాగును చూసి పలువురు మంత్రముగ్ధులవుతున్నారు. చేమంతి సోయగాలు ఆకట్టుకుంటున్నప్పటికీ పూల ధర తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

## నేడు విశ్వకర్మ జయంతి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నామని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసిన సుమారు 300 మంది లబ్ధిదారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా పనిముట్లు పంపిణీ చేస్తారని తెలిపారు. టూల్ కిట్లకు దరఖాస్తు చేసి న వారందరూ పాల్గొనాలని కోరారు.

## వింజమూరులో లేఅవుట్‌ల పరిశీలన

వింజమూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు లేఅవుట్లను మంగళవారం నుడా అధికారులు పరిశీలించారు. దాదాపు 22 లేఅవు ట్లు ఉండగా వాటిలో రెండింటికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు గుర్తించారు. మిగతా వా టికి నుడా అప్రూవల్ లేకపోవడంతో నోటీసు లు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ ఎల్ఆర్ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నుడా అధికారులు శ్రీధర్‌చౌదరి, సుష్మాంజలి పాల్గొన్నారు.



## రెండోరోజుకు దస్తావేజు లేఖర్ల సమ్మె

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా దస్తావేజుల సంక్షేమ సంఘం నాయకులు, దస్తావేజు లేఖరులు మంగళవారం రెండోరోజు కూడా పెన్‌డౌన్ సమ్మె చేశారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు జనాల్లేక బోసిపోయాయి. రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయానికి గండి పడింది. నగరంలోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జిల్లా దస్తావేజుల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ దస్తావేజుల రిజిస్ట్రేషన్ల సమయంలో ఆధార్‌కార్డు, ఓటీపీ, ఆటో మ్యూటేషన్ వల్ల ప్రజలు, డాక్యుమెంటు రైటర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు జేవీబీ అశోక్, నాయకులు పంచాగ్నుల పవన్‌కుమార్, ములుమూడి సురేష్‌బాబు, ఎండీ జమీరుద్దీన్, పూనం మాలకొండయ్య, ఎండీ మజహరుద్దీన్, కలిశెట్టి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దస్తావేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు

## పరిహారం చెల్లిస్తేగానీ.. పనులు సాగనివ్వం!

కలిగిరి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి 167బీజీ విస్తరణలో భాగంగా కలిగిరి-వింజమూరు మార్గంలో తమ భూములకు పరిహారం చెల్లించేవరకు పనులు సాగనివ్వమని పలువురు రైతులు మంగళవారం రహదారి పనులను అడ్డుకున్నారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం తమ భూములకు సెంటు ఒక్కింటికి రూ.4,76,000/- చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.35,600 మాత్రమే పరిహారం చెల్లించడంపై అభ్యంతరాలను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. రోడ్డు పనులు చేసే వారు తమ భూముల్లో ఇష్టానుసారం మట్టి తోలడం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేయడంపై వారు అభ్యంతరాలు తెలిపారు. తమకు పరిహారం అందించిన తరువాత మాత్రమే తమ భూముల్లో పనులు చేసుకోవాలని కరాఖండిగా తేల్చి చెప్పారు. ఈ విషయమై రోడ్డు నిర్వాహకులు బుధవారం తహసీల్దారు, ఆర్డీవోల సమక్షంలో రహదారి వెంబడి ప్రభుత్వ భూములను సర్వే చేయించి, నిర్మాణ పనులు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.



రోడ్డు నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

## పేద, బలహీన వర్గాల ఉన్నతికి పీ4 దోహదపడుతుంది

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పేద, బలహీన, అల్పాదాయ వర్గాలను ఉన్నతిలోకి తీసుకుని రావడానికి పీ-4 విధానం దోహదపడుతుందని డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్ స్టాటిస్టిక్స్ డిప్యూటీ డైరెక్టర్ పీ శ్రీనివాస్ అన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రం లో మంగళవారం చీఫ్ ప్లానింగ్ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామవార్డు సచివాలయ సిబ్బందికి పీ-4 కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీ-4లో ఆర్థిక, ఆర్థికేతర అంశాల ద్వారా వెనుకబడిన వర్గాలను ప్రోత్సాహించి వారిని ఉన్నత స్థితికి తీసుకొస్తారని చెప్పారు. బంగారు కుటుంబాలను, మార్గదర్శులతో ఏవిధంగా లింకప్ చేస్తారో శిక్షణలో తెలియచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి సురేష్ కుమార్ పాల్గొన్నారు.




శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

## ఎస్‌ఐ ఇంటిముందు మహిళ ఆందోళన

కావలి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముసునూరులోని పల్నాడు జిల్లా మాచర్ల ఎస్‌ఐ వెంకట్రావ్ బంధువు ఇంటి ముందు మంగళవారం రాత్రి ఓ మహిళ పెట్రోల్ బాటిల్‌తో వెళ్లి ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో కావలి 1వ పట్టణ ఎస్‌ఐగా పని చేస్తున్న సమయంలో స్థానిక వివేకానందపార్కు ప్రాంతానికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని మోసగించాడని మే 11న ఆ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐపై కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే, వెంకట్రావు తనను పట్టించుకోవడం లేదంటూ సదరు మహిళ మంగళవారం రాత్రి ఎస్‌ఐ అత్తగారింటి ముందుకు చేరుకోవటంతో విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెకు సర్ది చెప్పి పంపించారు.



## భద్రతపై చర్యలేవీ..?

- ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగికి కానరాని భద్రత
- ప్రభుత్వ వైద్యశాలల్లో కూడా ఇలాంటివి ఎన్నో..
- ఆరోగ్యశ్రీ మాటున కొందరి పేషెంట్ల వద్ద వసూళ్లు
- నేడు ప్రపంచ రోగి భద్రత దినోత్సవం

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందించి, రోగి ఆరోగ్య భద్రతపై అప్రమత్తంగా ఉండాలి. అయితే కొన్ని ఆసుపత్రుల్లో రోగుల ఆరోగ్య భద్రత డొల్లగా మారింది. ఈ నేపధ్యంలో రోగి భద్రతపై అనేక సందేహాలు లేకపోలేదు. రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకోవటంలో వైద్యులు పూర్తి స్థాయి వైద్య చికిత్సలు అందించలేదన్న విమర్శలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సెప్టెంబరు 17న (నేడు) ప్రపంచ రోగి భద్రత దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది.

**● నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నా భద్రతేదీ?**

జిల్లావ్యాప్తంగా నెల్లూరు జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీలు, 52 పీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రభుత్వపరంగా ఇంతటి నెట్‌వర్క్ ఉన్నా ఆయా ఆసుపత్రుల్లో ఆశించిన స్థాయిలో రోగుల ఆరోగ్య భద్రత లేదు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉంది. ప్రతిరోజూ ఇక్కడ 550 మంది వరకు రోగులు ఇన్‌పేషెంట్‌లుగా చికిత్స పొందుతుంటారు. ఇందులో గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయి. అయితే మిగిలిన రోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇక్కడ అత్యవసర రోగులకు ఐసీయూలో 36 వరకు పడకలు ఉండగా, రోగుల ఆరోగ్య చికిత్సలు అంతంత మాత్రంగానూ ఉన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే అత్యవసరంగా ముందుగా జీజీహెచ్‌కి పంపిస్తుంటారు. అయితే ఇక్కడ ఇద్దరు న్యూరాలజిస్టులు ఉన్నా ప్రయోజనం లేక పోవటంతో వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతున్నారు. ఇక్కడ గుండె వైద్య నిపుణులు ఒకరు ఉన్నా , ఆశించిన స్థాయిలో ఆయా వైద్యచికిత్సలు అందడం లేదు. జీజీహెచ్‌లో ప్రతినెలా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయంటే అక్కడ మెరుగైన వైద్య చికిత్సలు అందక పోవటమేనన్న విమర్శలు లేకపోలేదు. రోగి భద్రత ఇక్కడ ఎలా ఉందో దీన్ని బట్టి తెలుస్తుంది. ప్రతిఏటా వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ. 25 కోట్లు ఖర్చు చేస్తున్నా రోగి భద్రతకు పూర్తి స్థాయి రక్షణ లేకుండా పోతుంది.

**● సరైన మందులు ఇస్తున్నారా..?**

జిల్లావ్యాప్తంగా 500కిపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో 100కిపైగా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయి. అయితే వీటిలో వినియోగించే మందులలో చాలావరకు వ్యాధిని త్వరగా తగ్గించే వీలులేదు. కొన్ని మందులు అయితే ఆయా వ్యాధులకు పూర్తిస్థాయిలో పనిచేయవు. ఈ పరిస్థితిలో రోగి ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకరంగా మారుతుంది. ఈ ఆసుపత్రులకు ప్రతిరోజూ 10వేల మందికిపైగా రోగులు వస్తుంటారు. అయితే ఇందులో కొన్ని ఆసుపత్రులలోనే రోగులకు సరైన చికిత్సలు అందుతున్నాయి. జీజీహెచ్‌లోనే దాతలు రూ.కోటితో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేశారు. దాన్ని వినియోగంలోకి తీసుకు రావటానికి నెల పట్టిందంటే రోగి భద్రత ఎలా ఉందో తెలుస్తుంది.

**● రోగికి తప్పని పాట్లు**

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ(ఎన్టీఆర్ వైద్యసేవ) ద్వారా ఉచిత చికిత్సలు అందిస్తున్నది. జిల్లాలో 71 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో ఏటా 50వేల చికిత్సలు ఆరోగ్యశ్రీ కింద చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ కింద రూ. 120 కోట్లు చెల్లిస్తుంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకు పోయి ఉండటంతో కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగుల వద్ద నుంచి కొంత మొత్తం వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోగి భద్రతకు ఆర్థిక భారం తప్పటం లేదు.



జీజీహెచ్‌లో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

**రోగుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం**



జీజీహెచ్‌లో రోగుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. స్పెషాలిటీ వైద్యులను కూడా నియమిస్తున్నాం. ప్రతిరోజూ ఆసుపత్రికి 1500 మంది వరకు రోగులు వస్తుంటారు. ఇందులో 550కిపైగా ఇన్‌పేషెంట్‌లుగా రోగులు వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఆసుపత్రికి వచ్చే వారంతా పేదవారే... ఇలాంటి స్థితిలో రోగి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. అయితే రోగి భద్రతలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తున్నాం.

-డాక్టర్ కొండేటి మాధవి,
జీజీహెచ్ సూపరింటెండెంట్



## విద్యుత్ కనెక్షన్లు తొలగించారని రాస్తారోకో

కావలి రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడంగుంట ఎస్సీ కాలనీలోని నివాసాల విద్యుత్ కనెక్షన్లను ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించారని మంగళవారం రాత్రి కాలనీవాసులు కావలి - జలదంకి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులురెడ్డి, సిబ్బందితో కాలనీలో సుమారు 300 ఇళ్లకు సరఫరా నిలిపివేశారని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వీస్ వైర్లు, మీటర్లు తొలగించి తీసుకువెళ్లారని వారు ఆరోపించారు. రోడ్డుపై బైఠాయించటంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, బుధవారం ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని చెప్పడంతో వారు అక్కడ నుండి వెళ్లిపోయారు. ఈ విషయంపై ఈఈ బెనర్జీని వివరణ కోరగా, 4 నుంచి 5 నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించని వారి సర్వీస్‌లు తొలగించామని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని, అంతకంటే ఎక్కువ వస్తే బిల్లు చెల్లించాలన్నారు. ఒక్క బుడంగుంటలో సుమారు రూ.10 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. పట్టణం పరిధిలోని బిల్లులు చెల్లించని టీచర్స్‌కాలనీలో 40 కనెక్షన్లు, బాలాజీనగర్, కమ్మపాలెంలో 20, ఇందిరమ్మకాలనీలో 26, బుడంగుంట లో 60, తుమ్మలపెంటలో 10, రాముడుపాలెంలో 14 కనెక్షన్లు కలిపి మొత్తం 160 కనెక్షన్లను తొలగించామన్నారు.

## గ్రామైక్య సంఘంలో అవినీతి బాగోతం!

- వీవోఏ చేతివాటం.. సభ్యుల గగ్గోలు
- కందుకూరు ఎమ్మెల్యే వద్ద పంచాయితీ
- పూర్తి స్థాయి విచారణకు ఆదేశం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బడేవారిపాలెం గ్రామైక్య సంఘంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ సంఘం అధ్యక్షురాలు (వీఓఏ), గ్రూపు లీడర్లు కుమ్మక్కయి సభ్యుల నుంచి ప్రతి నెలా వసూలు చేసిన నగదును స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. గ్రామైక్య సంఘం పరిధిలోని బడేవారిపాలెం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ గ్రూపులోని 10 మంది సభ్యులు 1-12-2022లో పోకూరు స్టేట్‌బ్యాంక్‌లో రూ.10 లక్షలు ఎస్‌హెచ్‌జీ రుణం తీసుకున్నారు. నిబంధనల ప్రకారం గ్రూపులోని 10 మంది మహిళలకు ఒక్కొక్కరి వ్యక్తిగత ఖాతాలో రూ.లక్ష చొప్పున రూ.10 లక్షలు జమ చేయాలి. అయితే, అప్పటి వీఓఏ ఆదిలక్ష్మి బ్యాంకు అధికారుల వద్ద తన పలుకుబడి ఉపయోగించి ఒక్కొక్కరి ఖాతాలో రూ.80 వేలు చొప్పున 10 మంది సభ్యుల ఖాతాలో రూ.8 లక్షలు మాత్రమే జమ చేయించారు. మిగిలిన రూ.2 లక్షలు గ్రామైక్య సంఘం ఖాతాలో జమ చేయించారు. దీనిపై సభ్యులు నిలదీయగా, పాత రుణం రూ.2లక్షలు ఉన్నందున బ్యాంకు అధికారులు జమ చేసుకున్నారంటూ నమ్మబలికారు. ఆ రూ.2 లక్షలు సభ్యుల తీర్మానం లేకుండానే వీఓఏ డ్రా చేసి మరో గ్రూపుల్లోని సభ్యులకు స్త్రీనిధి కింద ఇచ్చారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద తతంగమే జరిగినట్లు సమాచారం. తాజాగా 5 రోజుల క్రితం కొత్త రుణం కోసం గ్రూపు సభ్యులు పోకూరు స్టేట్ బ్యాంక్‌కు వెళ్లారు. అయితే, రికార్డులు పరిశీలించిన మేనేజరు తీసుకున్న రుణం రూ.10 లక్షలు చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ సహా రూ.12.50 లక్షలు అయినట్లు పిడుగులాంటి వార్త చెప్పాడు. తాము రుణమంతా చెల్లించేశామంటూ గగ్గోలు పెట్టారు. ఈ విషయమై వెలుగు సిబ్బంది ద్వారా గ్రూపు లీడరును నిలదీయగా గ్రూపు లీడరు, వీఓఏపై చెప్పారు. గ్రూపు లీడరు, వీఓఏను ఇద్దరినీ నిలదీయగా ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో అసలు విషయం బయటపడింది. దీంతో గ్రూపు సభ్యులు కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు మొరపెట్టుకోవడంతో ఆయన వెలుగు అధికారులను పిలిపించి, అక్రమాలు నిగ్గుతేల్చాలని ఆదేశించారు. దీంతో వెలుగు అధికారులు 4 రోజుల నుంచి బడేవారిపాలెం గ్రా మైక్య సంఘంలో జరిగిన అక్రమాలపై విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో వీఓఏ ఆదిలక్ష్మి అంబేడ్కర్ గ్రూపు సభ్యులు ప్రతి నెల ఇచ్చిన నగదును బ్యాంక్‌లో చెల్లించకుండా సుమారు రూ.10 లక్షలకుపైగా సొంతానికి వినియోగించుకున్నట్లు తేలిందని ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. గ్రామైక్య సంఘం పరిధిలో 42 గ్రూపులు ఉన్నాయని. పూర్తిస్థాయిలో విచారిస్తేనే మరికొన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు. గతంలో కూడా సదరు వీఓఏ అక్రమాలకు పాల్పడటంతో రూ.8 లక్షలు రికవరీ చేశారు.

## మహిళల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక శ్రద్ధ

**● రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రమేష్**

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక కృషి చేస్తున్న ట్లు రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రమేష్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు విశేష సహకారం అందించాలని కోరారు. నెల్లూరు జీజీహెచ్‌లో బుధవారం నుంచి ప్రారంభం కానున్న మహిళా వైద్య శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని చేపట్టాయని చెప్పారు. ఈ శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.




జీజీహెచ్‌లో వైద్య శిబిరాల ఏర్పాటును పరిశీలిస్తున్న వైద్య నిపుణులు

## ఇంజనీరింగ్ శాఖల్లో అంతా ఇన్‌చార్జులే!

కావలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కీలకశాఖలైన ఆర్‌అండ్‌బీ, జలవనరులశాఖ, గృహనిర్మాణశాఖ, ప్రజా ఆరోగ్యశాఖల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లంతా కావలి డివిజన్‌లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో అభివృద్ధి ఎలా సాధ్యపడుతోంది. ఒక వేళ అభివృద్ధి పనులు జరుగుతున్నా ఇన్‌చార్జులు అందుబాటులో ఉండనందున వాటి నాణ్యతా ప్రమాణాలను పట్టించుకునే వారు లేరు.

**● పలువురికి పదోన్నతులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంజనీరింగ్‌శాఖలలో ఉన్న కీలక అధికారులకు కొందరికి పదోన్నతి లభించిందిజ మరి కొందరు బదిలీపై వెళ్లారు. అయితే వారి స్థానాలలో పర్మినెంట్ అధికారులను నియమించకుండా అంతా ఇన్‌చార్జీలతోనే కాలం వెళ్లబుచ్చుతన్నారు.ఈ ఇన్‌చార్జిలు ఎక్కడో వారి మాతృస్థానాల్లో ఉంటూ మొక్కుబడిగా వచ్చి పోతున్నారు. దీంతో అభివృద్ధికి ప్రణాళికలు వేసేవారు. జరుగుతున్న పనుల నాణ్యతలను పర్యవేక్షించే వారు కరువవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంటలు ఉండకూడదని, వాటిని వెంటనే పూడ్చాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ గుంటలను గుర్తించేందుకు అందుకు అవరమైన ప్రణాళికలు సిద్ధం చేసి పంపేందుకు కీలక మైన ఇంజనీరింగ్ అధికారులే లేకపోతే ఇన్‌చార్జిలకు ఆ బాధ్యత ఎందుకు ఒటుంది.

**● ఆర్‌అండ్‌బీలో..**

ఆర్‌అండ్‌బీ ఈఈగా ఉంటున్న రామక్రిష్ణ ప్రసాద్ పదోన్నతిపై నెల్లూరు ఎస్‌ఈ ఆఫీస్‌లో ఎస్‌టీఏ పీఏ వెళ్లారు. ఆయన స్థానంలో కోవూరుకు చెందిన వేణుగోపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే డీఈగా ఉంటున్న చక్రధర్‌రావు సెలవుపై వెళ్లారు. డీఈ ఇన్‌చార్జి బాధ్యతలను కూడా వేణుగోపాలే నిర్వహిస్తున్నారు. ఆయన రెండు పోస్టులకు ఇన్‌చార్జిగా ఉంటూ చుట్టపుచూపుగా కావలికి వచ్చి పోతున్నారు.

**● జలవనరుల శాఖలో...**

జలవనరులశాఖ ఈఈగా ఉండిన క్రిష్ణ మోహన్ నెల్లూరు ఎస్‌ఈ ఇన్‌చార్జిగా కూడా కొనసాగుతూ బదిలీపై గుంటూరు వెళ్లారు. సుమారు ఏడాది నుంచి ఇన్‌చార్జి ఈఈగా కావలి డీఈ పీఎం ఖాన్ కొనసాగుతున్నారు. చెరువుల అభివృద్ధి, చెరువుల్లో అక్రమంగా గ్రావెల్ తరలింపును అడ్డుకునే కార్యక్రమాలను ఇన్‌చార్జి స్థాయిలో ఆయన పూర్తిగా న్యాయం చేయలేక పోతున్నారు. అలాగే కావలిలో జలవనరులశాఖ ఆస్తులు ఎక్కువ భాగం అన్యాక్రాంతం అవుతున్నా వాటిని అడ్డుకుని కాపాడుకోలేక పోతున్నారు. ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరాలంటే గృహనిర్మాణశాఖ పనితీరు వేగంగా ఉండాలి. జగనన్న ఇళ్ల నిర్మాణాలలో ఎన్నో అక్రమాలు జరిగి విజిలెన్స్ విచారణ ఎదుర్కొంటున్నారు. అయితే ఇక్కడ కూడా ఈఈ, డీఈ ఇద్దరూ ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కావలి ఈఈగా ఉన్న మాధవరావు బదిలీపై కందుకూరుకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. గతంలో కావలి డీఈగా ఉంటూ కందుకూరుకు బదిలీపై వెళ్లిన నారాయణరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే బదిలీపై వెళ్లిన డీఈ స్థానంలో కూడా కొంత వారిని నియమించకుండా కావలి ఏఈకి డీఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

**● ప్రజా ఆరోగ్యశాఖలో...**

ప్రజా ఆరోగ్యశాఖలో డీఈ, ఏఈ ఇద్దరు ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. గతంలో ప్రజాఆరోగ్యశాఖ డీఈగా ఉన్న విజయలక్ష్మిని విజయవాడ టిడ్కోకు బదిలీ చేసారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించకుండా కొంత కాలం కందుకూరు డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత రెగ్యులర్ డీఈగా సుధారాణిని నియమించినా ఆమె ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నెల్లూరుకు డిప్యుటేషన్ వేశారు. దీంతో నెల్లూరుకు చెందిన ఎన్. జానకీరామ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రజా ఆరోగ్యశాఖలో ఇద్దరు ఏఈల పోస్టులుఉండగా ఒకరే కొనసాగుతుండారు. ఆయన కూడా బదిలీపై వెళ్లి పోగా కావలి సచివాలయ ఉద్యోగి కార్తీక్‌కు ఏఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రజా ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో కావలిలో జరుగుతున్న మంచినీటి సరఫరా పథకం అటకెక్కింది.



కావలి ప్రజా ఆరోగ్యశాఖ కార్యాలయం

## వ్యవసాయ విద్యార్థులకు అవగాహన

ఉదయగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు కళాశాల ఆసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న అవగాహన సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కడప కృషి విజ్ఞాన కేంద్రం, డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ అంకయ్య, డాక్టర్ కృష్ణప్రియలు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విస్తరణాధికారి గోపికృష్ణ, వివిధ విభాగాధిపతులు సునీత, కిషన్‌తేజ్, రఘునాధ్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బంగారం, వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ. 10568 |
| వెండి కిలో ధర | రూ. 133800 |
| వెండి ఒక గ్రాము | రూ. 136.80 |

న్యూస్ బాక్స్

## 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

సంగం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో ఆశ కార్యకర్తలకు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి 'స్వస్థ్-నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. పథకం విధివిధానాలను వివరించారు. బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్య శిబిరాల్లో మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఉచిత దంత వైద్య శిబిరం

సంగం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి మోడల్ ప్రాథమిక పాఠశాలలో నెల్లూరు నారాయణ దంత కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం వల్ల పేదలకు ఉపయోగకరమన్నారు. నారాయణ దంత వైద్య కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం నారాయణ ఆస్పత్రి వైద్యులు పంటి సమస్యలతో బాధపడుతున్నవారిని పరీక్షించి దంతాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు అందచేశారు. సమస్యలున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల దంత వైద్యులతోపాటు, ఏఎంసీ డైరెక్టర్ ఉక్కాల శ్రీనివాసులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

సంగం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ ట్రేడ్‌లో సీట్ల ప్రవేశానికి నాల్గవ విడదల ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు 17 నుంచి 27వ తేదీ వరకు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు 29వ తేదీ ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలోని సంగం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజన్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉదయగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవార మండలంలోని వెంగళరావునగర్, ఉదయగిరి-2 రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, నరసింహులు, ఉపాధ్యాయిని ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఐడీ కార్డుల అందజేత

సీతారామపురం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పబ్బులేటిపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో 66 మంది విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు అన్నంగి ప్రసాద్ తన సొంత నిధులు రూ.11 వేలు వెచ్చించి సమకూర్చిన నోటు పుస్తకాలు, ఐడీ కార్డులతో పాటు విద్యాసామగ్రిని మంగళవారం ఎంఈవో షేక్ మస్తాన్‌వలి పంపిణీ చేశారు.

## విధులకు ఎగనామం.. బోసిపోయిన సచివాలయం



విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరిపై అధికారులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు కనిపంచడమే లేదు. వరికుంటపాడు జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతం కావడంతో అధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతో కొందరు ఉద్యోగులు ప్రతినిత్యం విధులకు ఎగనామం పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం కాంచెరువు గ్రామ సచివాలయంలో ఉద్యోగుల కోసం ఎదురు చూసిన ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. 12మంది ఉద్యోగులకు కేవలం ఏఎన్‌ఎం మాత్రమే 10.50 గంటలకు హాజరయ్యారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. 11:30 గంటల వరకు మిగిలిన ఉద్యోగులు అటువైపు కన్నెత్తి చూడక పోవడంతో వారి కోసం ఎదురు చూసిన ప్రజలు చేసేదిలేక నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోవడంతో ఆ సచివాలయం బోసిపోయింది. కొంతమంది ఏకంగా విధులకు ఎగనామం పెడుతుండగా, మరికొంతమంది చుట్టపు చూపుగా ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సజ్జల కొనుగోలు కేంద్రం కోసం ఆందోళన



సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల్లో సజ్జల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రైతులు వేల రూపాయలు పెట్టుబడిపెట్టి సజ్జ పంట సాగు చేశారన్నారు. నిన్న మొన్నటి వరకు క్వింటా సజ్జలు రూ.2,600 నుంచి రూ.2,700లు పలకగా పంట చేతికిరాగానే రూ.1,900లకు చేరిందన్నారు. ఈ ధరతో రైతులకు పెట్టుబడులు కూడా రావన్నారు. గతిలేని పరిస్థితుల్లో కొంతమంది రైతులు దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే బిజ్జంపల్లి సచివాలయ ఎదుట ఆందోళన చేపట్టి మండలంలో చేపట్టిన భూముల రీసర్వేలో తప్పిదాలను రెవెన్యూ అధికారులు సరి చేయాలని కోరారు. రికార్డుల్లో తప్పిదాల వల్ల రైతులు ప్రభుత్వ పథకాలతో పాటు రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి రైతుసేవా కేంద్రాల్లో సజ్జల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సరి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు

● మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, విద్యారంగాన్ని విప్లవాత్మక సంస్కరణలతో ముందుకు తీసుకెళుతున్నామని దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరులోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని హాస్టల్ గదులు, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జ్వరాలతో అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని వైద్యులు మంత్రికి వివరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున విద్యాలయాలను నెలకొల్పి సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన మేరకు స్కిల్ డెవలప్మెంట్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం గురుకుల పాఠశాలలో జ్వరాలు ప్రబలిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలు అందించారన్నారు. గురుకులం పక్కనే ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా తరలించాలని అధికాలను ఆదేశించామన్నారు. ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సోలార్‌హీటర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ. వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, డీఈవో బాలాజీరావు, ఆర్డీవో పావని, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం, తహసీల్దారు పద్మజా కుమారి, గురుకులం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీటీకే రూత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సమస్యలపై గళం విప్పేవారేరీ!?

● నేడు మండల సర్వసభ్య సమావేశం



కంకరరాళ్లతో అధ్వానంగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు

ఉదయగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మూడు నెలలకు ఒకమారు జరుగుతుంది. జరిగిన ప్రతిసారి ప్రజాప్రతినిధులు, అధికారులు అరకొరగానే హాజరవుతారు. గత పాలకవర్గంలోనూ, ప్రస్తుతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో నిర్వహించిన సమావేశాల్లో ఎన్నో సమస్యలు ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. వాటిలో చాలా వరకు సమస్యలుగానే మిగిలిపోయాయి. ప్రధానంగా ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 12 మంది వైద్యులకు నలుగురే విధులు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల తరబడి ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు అటవీ అనుమతులు లేక 3.2 కిలోమీటర్ల రహదారి నిర్మాణం నిలిచిపోయింది. దీంతో కొండకిందపల్లి గ్రామాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉదయగిరి పట్టణంలోని రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విస్తరణకు చర్యలు చేపట్టినా అనివార్య కారణాల వల్ల ఆక్రమణల తొలగింపు నిలిచిపోయింది. సుజలస్రవంతి పథకంలో భాగంగా కుర్రపల్లి సమీపంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మదర్‌ప్లాంట్, పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో పలు రెవెన్యూ గ్రామాల్లో తప్పిదాలు చోటుచేసుకుని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయగిరి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇలా మండలంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సమావేశంలో ప్రజాప్రతినిధులు గళం విప్పకపోవడంతో అవి మూలనపడి మూలుగుతున్నాయి.

### నేడు సమావేశం

స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షత జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

### 'గుండెమడకల'ను సందర్శించిన

## సోమశిల ప్రాజెక్టు చైర్మన్, అధికారులు

వింజమూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుండెమడకల చెరువును మంగళవారం సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరి కేశవులు నాయుడు, జలాశయం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గుండెమడకల చెరువును రిజర్వాయర్ చేసేందుకు సోమశిల హైలెవల్ ఫేస్-2లో మంజూరైందని, సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు, మాజీ ఎఫ్‌సీఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రిజర్వాయర్‌ను పరిశీలించాలని అధికారులను ఆదేశించారన్నారు. ఈనెల 18 నుంచి జరుగు అసెంబ్లీ సమావేశాల్లో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ బీవీ రమణారెడ్డి, ఈఈ రాజశేఖర్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, సోమశిల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పీ. మధుమోహన్‌రెడ్డి, ఏఈ మల్లికార్జున, సోమశిల డైరెక్టర్ వంటేరు జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఎంపీడీవో సాయిప్రసాద్ సూచించారు. కేంద్రంలోని బిట్-1 సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

## ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం డిపో ఆవరణలో ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సమస్యల సాధనకు కార్మికులు ఐక్యతే మార్గమన్నారు. ఆర్టీసీలో కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ తనవంతు పాత్ర పోషిస్తుందన్నారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కాకు వెంకటయ్య, ఎస్థానీ, రవి, వెంకటేశ్వర్లు, రవిబాబు, గడ్డం నాగేశ్వరరావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జడదేవిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు మండలం జడదేవిలో మంగళవారం నెల్లూరుకు చెందిన నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచు కామేపల్లి పద్మజ సహకారంతో నారాయణ ఆరోగ్యమస్తు పథకంలో భాగంగా వైద్యులు కృష్ణప్రియ, నీలిమారాణి పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి బుధవారం వైద్యశాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కామేపల్లి వెంకటరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వరికుంటపాడులోనూ సర్పంచు దిలీప్‌కుమార్ సహకారంతో శిబిరం నిర్వహించారు.

## ఘనంగా గంధ మహోత్సవం

అనంతసాగరం సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వెలసిన మష్కూర్ అలీషాఖాదరీ దర్గా గంధ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్గాను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. గ్రామంలో గంధాన్ని ఊరేగించి ఫాతేహా నిర్వహణ అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఖవ్వాలీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాని సాహెబ్, మజీద్ సాహెబ్, మీరాన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి

## మోతాదు మించితే ప్రమాదమే

ఏఎస్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో యూరియాను మోతాదుకు మించి వాడితే ప్రమాదమేనని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం జమ్మవరం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. యూరియా వినియోగం తగ్గించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో మెళకువలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మునెమ్మ, వీఏఏ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

ఏఎస్‌పేట,సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను ఎంఈవో జ్యోతి ప్రారంభించారు. అండర్-14, అండర్-17 కేటగిరీలో బాలబాలికలకు వేరువేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా పోటీల కో ఆర్డినేటర్ ఎం వాసు, వ్యాయమ ఉపాధ్యాయుడు థామస్, పీడీలు మర్మద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వైద్య శిబిరాలు

చేజర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'స్వస్థ్ నారీ- స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం చేజర్ల, చిత్తలూరు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు డా. మెహతబ్, డా. నవీన్ తెలిపారు. 17న పాడేరు, 18న పాతపాడు, 19న పెళ్ళేరు, 20న పెరుమాళ్ళపాడు, చిత్తలూరు, 22న వావిలేరు, కోటితీర్థం, 23న మాముడూరు, 24న మడపల్లి, 25న ఆదురుపల్లి, యనమదల, 29న నెర్నూరు, చేజర్ల, 30న ఏటూరు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మహిళల ఆరోగ్యం, బీపీ, షుగర్, క్యాన్సర్, రక్తహీనత, టీబీ, లెప్రసీ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని, ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు.

## విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచాల్సింది టీచర్లే

చేజర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి). ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి సుధీర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం చేజర్ల మండలంలోని ఆదురుపల్లి మోడల్ ప్రైమరీ, కొలపనాయుడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధనలో నైపుణ్యాలు పెంచుకోవాలని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మెటీరియల్‌ను ఉపయోగించి బోధించాలన్నారు. టీఎల్‌ఎమ్‌లను ఉపయోగించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మస్తాన్‌బాబు, గీత, సీఆర్‌పీ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వింజమూరు,, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : వింజమూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం బుచ్చిరెడ్డిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాల్లో నెట్‌బాల్, రన్నింగ్ క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పీడీ ప్రభాకర్‌రెడ్డి ఆర్.అంజయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.మాలకొండయ్య, ఎం.సుమలత, ఎం.మాచర్ల, అభినందించారు.

## సీతారామపురం ఎంపీడీవో బదిలీ

సీతారామపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో సాయిప్రసాద్ తిరుపతి జిల్లా వాకాడుకు బదిలీ అయ్యారు. మర్రిపాడు మండల డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న ఆయన గత నెలలో ఎఫ్‌ఏసీపై మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీవోలకు పదోన్నతి కల్పించిన నేపథ్యంలో సాయి ప్రసాద్ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన తిరుపతి జిల్లా వాకాడుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వీరంతా ఈ వారంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

### తెల్లవారే వరకూ

## పెన్నాలో రిస్క్యూ ఆపరేషన్!

- వరదలో చిక్కుకున్న 17 మందిలో 9 మంది ఒడ్డుకు..
- 8 మంది గమ్యస్థానాలకు చేరి ఉంటారని అంచనా
- రాత్రంతా పెన్నాలోనే గడిపిన అధికారులు, పోలీసులు



పెన్నాలోని ఇసుక దిబ్బలో ఉన్న వారిని నిచ్చెన ద్వారా ఒడ్డుకు చేర్చుతున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదిలో చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకు వచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, అగ్నిమాపక దళం రాత్రి నుంచి తెల్లవారేవరకు శ్రమించారు. వరదలో చిక్కుకుపోయిన 17 మందిలో 9 మందిని ఒడ్డుకు చేర్చగా, మిగిలిన 8 మంది క్షేమంగా ఇళ్లకు చేరి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. సోమవారం సాయంత్రం పేకాట ఆడేందుకు, మద్యం సేవించేందుకు నగర శివార్లలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలోని పెన్నా నదిలోని ఇసుక దిబ్బలోకి వెళ్లారు. అయితే, పెన్నా బ్యారేజీలో గేట్లు తెరవడంతో ఒక్కసారిగా నీరు ఉప్పొంగాయి. దీంతో 17 మంది మందుబాబులు, పేకాట రాయుళ్లు నీటిలో ఇరుక్కుపోయారు.

● 112కు సమాచారం

నీటిలో చిక్కుకుపోయిన వారు రాత్రి 8.50 గంటలకు 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నా స్టేషన్‌కు చేరుకొని అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. భగత్‌సింగ్ కాలనీకి సమీపంలో ఉన్న హైవే కింద 17 మంది నీటిలో చిక్కుకున్నారని, త్వరగా రావాలని కోరారు. దీంతో అగ్నిమాపక జిల్లా అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఎఫ్‌వో శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాలతో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందిని వెంటబెట్టుకుని ఘటనాస్థలికి చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి 35 అడుగుల నిచ్చెనను నదిలోకి దించి రోప్‌ల సాయంతో ఆస్కా లైట్‌ను నదిలోకి దింపారు. అనంతరం సీఐ వేణుపాల్‌రెడ్డి సహకారంతో 9మందిని గుర్తించి, వెలుపలకు తీసుకువచ్చారు. మిగిలినవారు క్షేమంగానే బయటకి వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

● మంత్రి, అధికారుల పర్యవేక్షణ

పెన్నా నదిలో పలువురు యువకులు చిక్కుకున్నారన్న సమాచారం అందుకున్న మంత్రి నారాయణ వెంటనే జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. నెల్లూరు ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వాకా శ్రీనివాసులరెడ్డి, డీఎస్పీలు, స్పెషల్‌పార్టీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు వందల సంఖ్యల్లో పెన్నా వద్దకు చేరుకున్నారు. తెల్లవారుజామున 4.15 గంటల వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.

● గుర్తించిన వారు..

మారు మోహన్ (భగత్‌సింగ్ కాలనీ), చిర్రా ప్రభాకర్ (హెచ్‌ఆర్ పురం), వేమూరు సుమన్ (నాగేంద్రనగర్), బెల్లంకొండ సుభాన్ (కిసాన్‌నగర్), తాజుద్దీన్ (జాకీర్‌హుసేన్ నగర్), మూర్తి (సంతపేట), పగడాల మణికుమార్ (భగత్‌సింగ్‌కాలనీ టిడ్కో గృహాలు), పేరం ప్రవీణ్ (కోవూరు), సతీష్ (చంద్రబాబునగర్ ఏ బ్లాక్).

● గుర్తించని వారు

విజయ్, వీరేంద్ర (చంద్రబాబునగర్), ప్రసన్న (నిప్పో సెంటర్), ఏసు (అల్లీపురం టిక్కో గృహాలు), కోడి (కోవూరు), వెంకటేశ్వర్లు (జాకీర్‌హుస్సేన్ నగర్), విజయ్ (కిసాన్‌నగర్), సాయిబాబాలు నీటిలో నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు.

## పేకాట స్థావరంపై దాడులు

● ఏడుగురి అరెస్టు ● రూ.3160 నగదు స్వాధీనం



అరెస్టు చేసిన పేకాటరాయుళ్లతో పోలీసు సిబ్బంది

పొదలకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వావింటపర్తి గ్రామ శివారులో పేకాట స్థావరంపై కండలేరు డ్యామ్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3160 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## వాగులో పడి బాలుడి మృతి



శివరాం మృతదేహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులను మేపుకునేందుకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం జీ.కొత్తపల్లి శివారు ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం సన్నవారిపల్లికి చెందిన చాగంరెడ్డి శ్రీను, లక్ష్మీకాంతమ్మ దంపతులు ఏడాది క్రితం జీ.కొత్తపల్లిలోని తన బావమరిది కుమ్మిత మాల్యాద్రి నివాసానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ, గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వ్యాపార నిమిత్తం మాల్యాద్రి పూణేకు వెళ్లడంతో ఆయన కుమారుడు శివరామ్(15) రోజు మాదిరిగానే పిల్లాపేరు వాగు సమీపంలోకి గేదెలను మేత కోసం తోలుకెళ్లాడు. గేదెలు అవతలి ప్రాంతానికి వెళ్లడంతో వాటి కోసం వెళ్లిన సహచరుడు ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో శివరాం సైతం వాగులోకి దిగి లోతు ఎక్కువగా ఉండడంతో ఒక్కసారిగా మునిగిపోయి మృతువాత పడ్డాడు. అనంతరం ఒడ్డుకు చేరుకున్న సహచరుడికి అతను కనిపించకపోవడంతో భయాందోళనకు గురై గ్రామస్థులకు సమాచారం అందించాడు. గ్రామస్థులు హుటాహుటీనా అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఒడ్డున ఉన్న దుస్తులతో పాటు నీళ్లలో తేలాడుతున్న చెప్పుల ఆధారంగా వాగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించి ఇంటికి తరలించారు.

## దాడి కేసులో నిందితుడి అరెస్ట్

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్‌కళాశాల వద్ద జరిగిన గొడవలో దేవిరెడ్డి నరేంద్రపై బీరు బాటిల్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడు ఒంగోలు సాయికుమార్‌ను శ్రీనివాస కళాశాల సమీపంలో మంగళవారం రెండవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విట్స్ కళాశాల విద్యార్థులైన నెల్లూరు పడారుపల్లికి చెందిన దేవిరెడ్డి నరేంద్రకు, పట్టణంలోని కసాయివీధికి చెందిన సాయికుమార్‌కు మధ్యన జరిగిన గొడవలో నరేంద్రను బీరు బాటిల్‌తో దాడి చేసి సాయికుమార్ పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకుని కోర్టుకు హాజరుపర్చారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 150 |
| స్కిన్ చికెన్ | 264 |
| స్కిన్‌లెస్ | 290 |

కోడిగుడ్ల ధర (100): 560

## డ్రైనేజీ కాలువల మరమ్మతులు చేపట్టండి

కావలి(టౌన్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కాలం చెల్లిన పాత డ్రైనేజీ కాలువల మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నేతలు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య మాట్లాడుతూ శాంతినగర్, కచ్చేరిమిట్ట, బీకే నగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్ ముసునూరు తదితర ప్రాంతాల్లో కాలువలు పగిలిపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తుందని, దీంతో వీధులు దుర్గంధభరితంగా మారి దోమలకు నిలయాలుగా మారుతున్నాయన్నారు. వర్షాలు పడినప్పుడు ఆ మురుగు నీరు ఇళ్లల్లోకి ప్రవేశించి దుర్భరంగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే సైడ్ కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, తిరుపాల్, ప్రవీణ్, వై ఉదయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# రహదారిపై నిలువ నీడేది..?

● రోడ్డు విస్తరణలో చెట్లు, బస్‌షెల్టర్లు కూల్చివేత ● కొత్తవి నిర్మించడంలో అలసత్వం ● ప్రయాణికులు, విద్యార్థుల అవస్థ

కలిగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు మార్గంలో జాతీయ రహదారిపై బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టక ముందు దాదాపు ప్రతీ గ్రామంలో రహదారి వెంబడి షెల్టర్లు ఉండడంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు ఎంతో అనుకూలంగా ఉండేది. అయితే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెండేళ్ల క్రితం రహదారి పనులు ప్రారంభమైన తరువాత రహదారి వెంబడి గ్రామ ముంగిళ్లలో ఉన్న షెల్టర్లను కూల్చివేశారు. దీంతో అప్పటి నుంచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు షెల్టర్లతో పాటు రహదారి వెంబడి ఉండే పెద్ద పెద్ద చెట్లను కూడా కూకటి వేళ్లతో పెకిలించి తీసేశారు. దీంతో షెల్టర్లు, చెట్లు కనుమరుగయ్యాయి. రహదారి పనులు దాదాపు పూర్తయినా బస్‌షెల్టర్ల నిర్మాణాలు మాత్రం పూర్తికాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కలిగిరి పట్టణంలో తహసీల్దారు కార్యాలయ కూడలిలోని బస్‌షెల్టర్ కూల్చివేశారు. ఈ కూడలి నుంచే కావలి, నెల్లూరు, ఉదయగిరి, కొండాపురం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు స్థానికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. గతంలో ఈ కూడలి ప్రాంతంలో బస్ షెల్టర్‌తోపాటు పెద్ద పెద్ద చెట్లు ఉండటంతో ప్రయాణాలు చేసేవారికి ఇబ్బందులు లేకుండా ఉండేది. రహదారి విస్తరణ అంటూ ఇళ్లు, చెట్లు, బస్ షెల్టర్లు కూల్చివేసే సరికి ఈ ప్రాంతం ఎడారిగా మారింది. కనీసం నిలబడటానికి కాసింత నీడలేకపోయేసరికి ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసే కాంట్రాక్టర్లు ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్ల నిర్మాణాలను పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



రహదారిపై మండుటెండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



బస్సుల కోసం రోడ్డుపై నిలుచున్న విద్యార్థులు

### మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు

● వలేటివారిపాలెం: వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో నిలువ నీడలేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎండకు ఎండతూ వానకు తడుస్తూ చెట్లు, కిరాణాషాపులు, హోటళ్లు, దుకాణాల ముందు గంటల తరబడి నీడ కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. దుకాణాల ముందు నిలబడిన ప్రయాణికులను వ్యాపారులు తమ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుందని చీదరించుకుంటున్నారు. లక్షలు వెచ్చించి ఊరి చివరన నిర్మించిన బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారింది. మూడు రోడ్ల కూడలిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రయాణికులకు సౌకర్యాల కల్పనపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించడంలేదు. బస్టాండులో నీడవసతి, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వసతులు కరువే. బస్టాండు సెంటరులో ఆర్టీసీ అధికారులు కనీస సదుపాయాలు కల్పించకపోడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో మహిళలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అయినప్పటికీ సం బంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో బస్‌షెల్టర్, మరుగుదొడ్లు, తా గునీరు తదితర వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వలేటివారిపాలెంలో మండుటెండలో ప్రయాణికులు

## న్యూస్ బాక్స్

### రైతు ఆత్మహత్యపై ఆర్డీవో విచారణ

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాళ్లూరు పంచాయతీ దళితవాడకు చెందిన ఏసుపోగు మెలకయ్య అనే రైతు ఏప్రిల్ నెలలో అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై కావలి ఆర్డీవో సన్నీవంశీకృష్ణ మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. రైతు మెలకయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితి, అప్పుల వివరాలను కుటుంబ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ నాగరాజు, ఏవో శైలజ, ఏఎస్‌ఐ కోటేశ్వరరావు, స్థానిక టీడీపీ నేత ఎల్.మాధవరావు, తదితరులు ఉన్నారు.

### మెగా వైద్యం శిబిరం

బిట్రగుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ది పూర్ పీపుల్స్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ చేవూరు చిన్న ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి క్యాన్సర్ విభాగం వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు జేవీఏఎన్ ధీరజ్, వై.సుదర్శన్‌రెడ్డి, సాహిత్య రెడ్డి, లోకేశ్వరిలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ డాక్టర్ కే.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సొసైటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం సొసైటీ కార్యాలయంలో బుధవారం సొసైటీ అధ్యక్షుడుగా గుత్తా మహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సెక్రటరీ నవీన్ తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

### నేటి నుంచి 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్'

ఉలవపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు కరేడు ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం కరేడు పీహెచ్‌సీలో వైద్యఆరోగ్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. 17న ఆత్మకూరు, 18న అలగాయపాలెం, 19న కొల్లూరుపాడు, 20న మన్నేటికోట, 22న కే రాజుపాలెం, 26న రామకృష్ణాపురం, 29న ఉలవపాడు వడ్డెరపాలెంలో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### జేఎల్ఏ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా గోపిచంద్ ప్రకాష్

ఉలవపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న గారపాటి గోపిచంద్ ప్రకాష్‌ను జోన్-3 నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

### టీకాల కార్యక్రమం పరిశీలన

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టరు జీ.చక్రధరరావు, కందుకూరు ఏడీ జె.చంద్రమోహన్‌లు మంగళవారం మాచవరం గ్రామంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టరు ఎస్.సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, గ్రామరైతులు పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం :** పోకూరులో గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు సోమినేని తిరుమలరావు ప్రారంభించారు. పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్, సిబ్బంది అశోక్, చౌడ య్య, చైతన్య, వెంకట రావు, దినేష్, మనోహర్, మహిత, మౌనిక పాల్గొన్నారు.

### నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలో రక్తదాతల వాట్సాప్ గ్రూప్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17న ఉదయం 10గంటలకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సక్షమ్ కార్యవర్గసభ్యుడు చెన్నా రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.

### ఓజోన్ పొరపై అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఓజోన్‌పొర ప్రాధాన్యత, అది దెబ్బతినకుండా కాపాడుకునేందుకు మనవంతుగా పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, కమల్‌బాబు, ఎన్వీ శ్రీహరి, కేవీ పద్మావతి, ఐ. అనూష, పి.రాజగోపాల్, ఎం.తిరుపతిస్వామి, కె.నరేష్‌రాజా, జి.బ్రహ్మయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 22 నుంచి కలుగోళ్ల శాంభవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆలయ ఈవో రాధాకృష్ణ

కావలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆలయ ఈవో అరవ రాధాకృష్ణతో కలిసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేప ట్టాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రైల్వే అండర్‌పాస్ పనుల పరిశీలన

ముసునూరు రాఘవేంద్రకాలనీ వద్ద జరుగుతున్న రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ అండర్‌పాస్ పూర్తి అయితే ఇందిరమ్మకాలనీ, తుఫాన్‌నగర్ తదితర రైల్వే ట్రాక్‌కు పడమరవైపున ఉన్న ప్రజల రాక పోకలకు మార్గం సుగమం అవుతోందన్నారు. ముసునూరు రైల్వే గేట్ వద్ద పడిగాపులు కాయాల్సిన పని తప్పుతోందన్నారు.

### 'ఉపాధి హామీ'లో అవకతవకలపై విచారణ



ఉపాధి కూలీలను విచారిస్తున్న అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడులో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామంలో లేని వారి పేర్లతోపాటు, ఒకరి జాబ్ కార్డుపై మరొకరితో పనిచేయించి క్షేత్ర సహాయకురాలు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడినట్లు గ్రామానికి చెందిన చాగంటి కృష్ణ, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు జిల్లా అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి హామీ ఏపీడీ గ్రామంలో జూలై నెలలో విచారణ చేపట్టారు. అందులో భాగంగా మళ్లీ ఉపాధి కూలీలను విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ షేక్ సర్దార్, ఏపీవో మురళీధరరావు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## నవధాన్యాలను పచ్చిరొట్ట పైర్లుగా సాగు చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

అల్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నవధాన్యాలను పచ్చిరొట్ట పైర్లుగా సాగుచేసి భూసారాన్ని పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి అన్నారు. మండలంలోని నార్తుమోపూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం వలన భూసారం తగ్గిపోవడంతోపాటు అధిక ఖర్చులు భరిస్తున్నారన్నారు. కేవలం అవగాహన లోపంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. యూరియా అవసరం కంటే అత్యధిక మోతాదులో వినియోగిస్తున్నారని, తద్వారా పైర్లలో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయన్నారు. మళ్లీ ఆ సమస్యలకు పురుగు మందులు వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఈ కారణాలతో రైతులకు వరిసాగులో ఆర్థిక భారం పడుతుందన్నారు. అవగాహనతో పచ్చిరొట్ట పైర్లను వేయడం ద్వారా అనేక సమస్యలు తగ్గుతాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సోజీరావు, నాగరాజు, డీఆర్సీ వ్యవసాయాధికారి మధురిమ, అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ జన్మదిన పక్షోత్సవాలను జయప్రదం చేయండి

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారతప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన పక్షోత్సవాలను జయప్రదం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వర ప్రసాదరావులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 17న ఉదయం 10 గంటలకు స్థానిక అంకమ్మ దేవాలయంలో మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని, పూజలు, 20న పట్టణంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 22న పేదలపై భారంపడే వివిధరకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించినందుకు నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు మోదీ అభిమానులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ఇంటూరి



టీడీపీలో చేరిన చాకిచర్ల వైసీపీ శ్రేణులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చాకిచర్ల, పెద్దపట్టపుపాలెం గ్రామాల్లో రూ.45 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. నూతన సచివాలయం భవనం ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అన్ని సమస్యలను తరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా చాకిచర్లలోని 35 వైసీపీ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి చేరగా వారికి పసుపు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్దపట్టపుపాలెం ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని, మీ అభిమానాన్ని ఎన్నటికి మర్చిపోనన్నారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు మల్లికార్జున, రమేష్, నాయకులు మిరియం భాస్కర్, సుదర్శి శ్రీనివాసులు, ఎండేటి శ్రీను, సాంబయ్య, ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ల వద్ద ప్రైవేట్ బస్సులు ఆపకుండా చర్యలు

కావలి(టౌన్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఆపకుండా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డీపీటీవో ఎస్కె షమీమ్ తెలిపారు. మంగళవారం కావలి డిపోను ఆమె సందర్శించి తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేసినప్పటి నుంచి కావలి డిపో 92శాతం ఆక్యుపెన్సీ సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. మహిళా ప్రయాణికుల శాతం విపరీతంగా పెరిగి ఇబ్బందికరంగా మారినట్లు వాపోతున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకుపోగా స్త్రీశక్తి పథకం వలన కండక్టర్ల ఉద్యోగం మరింత సులభం అయిందని, 0 టిక్కెట్ వలన ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కొత్త పథకాలు ప్రవేశపెట్టినప్పుడు కొత్తలో కొంత తడబాటు ఉండడం సహజమేనన్నారు. ఉచితం వల్ల సంస్థకు ఎటువంటి నష్టంలేదని ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ ద్వారా మరింత లాభాలు పెరుగుతాయన్నారు. డిపో పరిసరాల్లో ప్రైవైట్ ట్రావెల్స్ నిలపకుండా చర్యలు తీసుకోవాలని కావలి డీఎంను ఆదేశించారు. కార్యక్రమంలో కావలి డీఎం ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కల్పన రెడ్డి, ఎఫ్ఎం ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీసీ డీపీటీవో

## నవంబరుకి ప్రభుత్వ భూములు గుర్తించాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీవంశీకృష్ణ, హాజరైన సర్వేయర్లు

కావలి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : కావలి డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో ఈ ఏడాది నవంబరు చివరి నాటికి ప్రభుత్వ భూములు గుర్తించి వాటికి హద్దులను ఏర్పాటు చేయాలని కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణ ఆదేశించారు. డివిజన్‌లోని సర్వేయర్లతో మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు మండలాల్లో మూడు విడతలుగా జరిగిన రీసర్వేపై సమీక్షించారు. ఈ సమీక్షలో ప్రధానంగా రీసర్వేలో ఎదురైన సమస్యలు వాటిపరిష్కారానికి తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. రీసర్వే రికార్డులు ఎంతవరకు పూర్తి చేసి అప్పగించారనే దానిపై చర్చించారు. అయితే రీసర్వే పూర్తి అయ్యేసరికి ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున ముందుగా డివిజన్‌లోని అన్ని గ్రామాల సరిహద్దులను ఏర్పాటు చేసి ఆయా గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని సర్వేచేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రీసర్వే చేసిన గ్రామాల్లో వాటి రికార్డులను ఎంతవరకు పూర్తి చేసారనే దానిపై సమీక్షించారు. భూముల సబ్‌డివిజన్లు, ఓఎస్‌డీ సంబంధించిన అంశాలు, మీసేవల ద్వారా వచ్చిన అర్జీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్లు శ్రీనివాసరావు. నరసింహమూర్తి, మండల, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెన్నమ్మ పరవళ్లు!


(5వ పేజీ తరువాయి)


23,234 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో నీటి నిల్వ 73.450 టీఎంసీలుగా ఉంది. దిగువ డెల్టాకు గేట్ల ద్వారా 14,850, పవర్ టన్నెల్ నుంచి 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

● సంగంలో 28 వేల క్యూసెక్కులు

సంగం : పెన్నా బ్యారేజ్ వద్ద మంగళవారం 28 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైంది. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.2 అడుగుల చేరింది. బెజవాడ పాపిరెడ్డి కాలువకు 350 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగతా 27,400 క్యూసెక్కుల నీటిని 26 గేట్ల ఎత్తి దిగువ పెన్నానదికి విడుదల చేస్తున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఏవో శ్రీవాణి

జలదంకి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పలు పథకాలపై ఏవో శ్రీవాణి వివరించారు. వేములపాడు ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి మాట్లాడుతూ ధాన్యం ధరలు ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.3వేలు తక్కువకు దళారులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల ఆవశ్యకతను వివరించారు. దీనికి జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు స్పందిస్తూ సమా వేశంలో సభ్యులు తీర్మానం ఇస్తే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ద్వారా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ఈ సమావేశంలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ.మధురెడ్డి, వైస్ఎంపీపీ మేకల ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

కందుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన కౌలు రైతులకు గుర్తింపుకార్డులు దక్కేలా గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్‌వోలు సమన్వయంతో కృషి చేయాలని తహసీల్దారు లావణ్య, మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీంలు కోరారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వీఏఏలు, వీఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో కౌలురైతు గుర్తింపు కార్డులపై పలు సూచనలు చేశారు. వీఏఏలంతా పంట కోత ప్రయోగాలు పూర్తిచేసి నివేదికలు పంపడం ద్వారా రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ అందేలా చూడాలని కోరారు.

## వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల నిరసన

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నెలంతా చెత్తాచెదారం తొలగించే పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకుంటే బ్రతికేది ఎలాగయ్యా అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బోగోలు మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంగళవారం నిరసన చేపట్టారు. పంచాయతీ కార్యాలయం నుంచి బోగోలు బజారు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు పనిముట్లు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అధికారులత ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పుష్కరిణిలో మండపం పనుల ప్రారంభం

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరణిలో మండపం పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. కోనేటిలో పేరుకుపోయిన పూడిక తొలంగిపు అనంతరం వీపీఆర్ ట్రస్ట్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులచే శంకుస్థాపన చేయించిన కోనేరులో మండపం కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. వీపీఆర్ ట్రస్ట్ ఇంజినీరు కాకు వెంకటస్వామి రెడ్డి, నరసారెడ్డి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు రావి.రంగయ్య, ఆర్.విజయ్‌కుమార్, కే.బసిరెడ్డి, వై.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



కోనేటి నడుమ చేపట్టిన మండపం పనులు

## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లిలో వెలసి ఉన్న పోలేరమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ సర్పంచు గండూరి మంజుల, శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి సద్ది, నైవేద్యాలను అర్పించారు. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారివెంట భాస్కర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మురళీరెడ్డి, ఓబులురెడ్డి, శ్రీధర్, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు బోనస్ చెక్కుల పంపిణీ

బిట్రగుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ మద్దూరుపాడు కావలి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బోగోలు మండలం పాతబిట్రగుంటలో మంగళవారం పాడి రైతులకు 2024-25 సంవత్సరపు బోనస్‌కు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా సంగం డెయిరీ జోనల్ మేనేజర్ డాక్టర్ వినోద్ హాజరై సంగం డెయిరీకి పాలు పోసే పాడిరైతులు 22 మందికి రూ.66,994 అందచేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ అధికారి వెంకయ్య, పాల సేకరణ కేంద్ర కార్యదర్శి లక్ష్మీప్రసన్న, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

# దారు శిల్పులకు ఎర్రచందనం

**20 కిలోల్లోపు విక్రయాలకు అనుమతి**

**రూ.200 కోట్లతో శ్రీకాళహస్తి-తడ సిక్స్‌లేన్ రోడ్డు**

**నాగలాపురం-చినపాండూరు రోడ్డు విస్తరణ**

**కలెక్టర్ ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్**

**టీటీడీపై అసత్య ప్రచారాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశం**



కాన్ఫరెన్సులో పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదాముల్లో వేల టన్నుల కొద్దీ మూలుగుతున్న ఎర్రచందనం దుంగలను దారు శిల్పులకు విక్రయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎర్రచందనంతో శ్రీవారి విగ్రహాలు చెక్కించి వాటిని విక్రయించేందుకు పరిమితం చేయనుంది. అమరావతిలో జరుగుతున్న 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా రెండో రోజైన రోజైన మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ చేసిన ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సదస్సులో ఎస్పీ సుబ్బరాయుడు కూడా పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో చెక్క బొమ్మల తయారీకి పేరుమోసిన దారు శిల్పులున్న సంగతి తెలిసిందే. వారికి 20 కిలోలు మించకుండా ఎర్రచందనం దుంగలు విక్రయించాలని, వీటితో శ్రీవారి విగ్రహాలు తయారు చేయించి తిరుపతి విమానాశ్రయంలో విక్రయాలకు పెట్టాలని కలెక్టర్ ప్రతిపాదించారు. ఇదంతా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరిగేలా చూడాలని ప్రతిపాదించగా సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

● శ్రీకాళహస్తి నుంచీ శ్రీసిటీ మీదుగా తడ వరకున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్‌గా మార్చాలని గతంలోనే సీఎం చంద్రబాబు ఆదేశించారు. డీపీఆర్ తయారీ క్రమంలో సర్వే జరపడంతో భూసేకరణ సమస్య, కొండలు అడ్డుగా వస్తాయని తేలడంతో ఈ ప్రతిపాదన ముందుకు కదల్లేదు. ఇందులో కొన్ని మార్పుచేర్పులతో పాటు నిర్మాణ వ్యయం ప్రభుత్వంపై పడకుండా ఓ ప్రతిపాదనను కలెక్టర్ నివేదించారు. రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మించేందుకు సీఎం వెంటనే అంగీకారం తెలిపారు.

● శ్రీసిటీ నుంచీ తడ మీదుగా కాకుండా నాగలాపురం మీదుగా ప్రత్యామ్నాయ రోడ్డును అభివృద్ధి చేయాలని కలెక్టర్ సీఎంకు నివేదించారు. రోడ్డు ప్రమాదాలతో పాటు అత్యవసర సమయాల్లో ఇది అందుబాటులో ఉంటుంది. సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల మధ్య వున్న చిన పాండూరు ప్రాంతం శ్రీసిటీకి చేరువగా వుండడంతో పాటు ఏపీఐఐసీకి చెందిన పారిశ్రామిక వాడలకు కూడా సమీపంలో వుంది. పరిశ్రమలు అధికంగా వెలుస్తున్నందున నాగలాపురం మీదుగా చెన్నైకి రాకపోకలు సాగించడానికి ప్రస్తుతమున్న రోడ్డు ఉపయోగపడదు. దాన్ని విస్తరిస్తే బహుళ ప్రయోజనాలుంటాయని కలెక్టర్ చేసిన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు.

### సేవా రంగంలో జిల్లాకు "ఏ" గ్రేడ్

సేవా రంగంలో ప్రభుత్వం నిర్దేశించిన స్కోర్ బోర్డులో తిరుపతి జిల్లాకు ఏ గ్రేడ్ లభించింది. రాష్ట్రంలో 82 పాయింట్లతో జిల్లా 13వ స్థానంలో నిలిచింది. వార్షిక జీవీఏ లక్ష్యం రూ. 37,191 కోట్లు కాగా తొలి త్రైమాసికంలో రూ. 8234 కోట్లు సాధించింది. రాయలసీమలో నంద్యాల, అనంతపురం జిల్లాలు మాత్రమే తిరుపతి కంటే ముందున్నాయి. జీవీఏ లక్ష్య సాధనలో జిల్లా 15వ స్థానంలో ఉంది.

### టీటీడీపై వైసీపీ పెయిడ్ బ్యాచ్ దుష్ప్రచారాన్ని అడ్డుకోండి!

తిరుమలలో ప్రతి చిన్న విషయాన్నీ వైసీపీ పెయిడ్ బ్యాచ్ ప్రపంచవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆరోపించారు. తిరుమల ఆలయంపై, దేవస్థానంపై దుష్ప్రచారాన్ని ఎంతమాత్రం అనుమతించరాదని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండి నిజానిజాలు ప్రజలకు తెలపాలని ఆదేశించారు. శాంతి భద్రతల గురించి ప్రజల్లో మరింత చైతన్యం తేవాలని, గంజాయి స్మగ్లింగ్, వినియోగం అరికట్టేలా మరింత దృష్టి సారించాలని ఆదేశించారు.

### పది క్లస్టర్లలో పెట్టుబడులకు అవకాశం

జిల్లాల్లో భారీ పెట్టుబడులకు అవకాశమున్న క్లస్టర్లను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఉదాహరణకు తిరుపతి జిల్లాలో పది క్లస్టర్లు ఏర్పాటు చేయడానికి తగిన వనరులు ఉన్నాయన్నారు. పరిశ్రమలకు, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు రాబట్టడానికి ప్రయత్నించాలన్నారు. అన్ని క్లస్టర్లలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రయత్నించాలని, అందులో వాణిజ్య, నివాస, పారిశ్రామిక, వినోదాత్మక అంశాలుండాలని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్‌లో ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను భాగస్వాములను చేయాలని సూచించారు. టూరిజం కోసం తిరుపతిలో 120 ఎకరాల వ్యూహాత్మక భూమిని కలెక్టర్ గుర్తించారంటూ ప్రస్తావించారు. అలాగే వంద పారిశ్రామిక పార్కుల కార్యక్రమం కింద డీపీఐఐటీకి ప్రతిపాదించిన ల్యాండ్ పార్శిల్స్ విషయానికొస్తే జిల్లాలో షిప్ బిల్డింగ్ రంగానికి దుగరాజపట్నం వద్ద, స్పేస్ సిటీ కోసం రౌతు సూరమాల వద్ద, మల్టీ ప్రొడక్ట్ పరిశ్రమల కోసం శ్రీసిటీ వద్ద భూములు గుర్తించిన విషయం కూడా కాన్ఫరెన్సులో ప్రస్తావనకు వచ్చింది.

## భూమన.. బూమరాంగ్



టీటీడీపై దుష్ప్రచారాలను వైసీపీ నేతలు తారస్థాయికి చేరుస్తున్నారు.ఇటీవల పదేపదే ఆరోపణలతో హోరెత్తిస్తున్న టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి తాజాగా అలిపిరి పాత చెక్‌పోస్టు సమీపంలో పడేసిన విగ్రహాన్ని చూపిస్తూ మహావిష్ణువుకు ఘోర అపచారం జరిగిపోయిందంటూ ఆరోపణలకు దిగారు.అసలా విగ్రహం విష్ణువుదే కాదని, తయారీ సందర్భంగా పాడవడంతో పడేసిన శనీశ్వరుడి విగ్రహమని టీటీడీ వర్గాలతో పాటు విగ్రహ తయారీదారు కుమారుడూ వివరణ ఇచ్చారు.అంతేకాదు టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసినప్పుడు ఆ విగ్రహం కనిపించలేదా అంటూ టీడీపీ నేతలు ప్రత్యారోపణలకు దిగారు. టీటీడీపై కరుణ బరితెగింపు ధోరణి చివరకు బూమరాంగ్ అయిందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

6

## సైబర్ వలకు చిక్కిన యోగా మాస్టర్

● ట్రేడింగ్ యాప్‌లతో రూ.11.99 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫేక్ ట్రేడింగ్ యాప్ లింకు పంపారు. పెట్టుబడి పెడితే ఆదాయం వస్తుందని నమ్మించారు. ఇలా ఓ యోగా మాస్టర్ నుంచి రూ.11.99 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలంలోని ఓ యోగా మాస్టర్ సెల్‌ఫోనుకు గత నెలలో హేమంగి డేట్ అనే వ్యక్తి వాట్సాప్ ద్వారా టీకేఇన్-స్విప్1.కామ్ అనే లింకు పంపాడు. ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌కు సంబంధించిన ఈ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో ఆదాయం వస్తుందని నమ్మించాడు. వారి మాయ మాటలు నమ్మిన ఆయన రూ.11.99 లక్షలను ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. ఆ ట్రేడింగ్ యాప్‌లోని యోగా మాస్టారు వ్యాలెట్‌లో మొదట్లో కొంత లాభం చూపించారు. ఆ తర్వాత ఆయన పెట్టుబడి రూ.26,41,304 అయినట్లు చూపించారు. దీనిని విత్‌డ్రా చేసుకోవాలంటే దీనిపై 20 శాతం కమీషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై అనుమానంతో ఆయన ఐసీఐసీఐ బ్యాంకు అధికారులను సంప్రదించగా.. అది ఫేక్ యాప్ అని తేల్చారు. దీనిపై బాధితుడు 1930కు ఫోన్ చేసి తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

### లా అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లా మొదటి దశ కన్వీనర్ కోటా అడ్మిషన్ల గడువును పొడిగించారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు 18వ తేదీ, వెబ్ ఆప్షన్ల ఎంట్రీకి 19, వెబ్ ఆప్షన్లలో మార్పులకు 20, సీట్ల కేటాయింపు 22వ తేదీగా నిర్ణయించారు. 22 నుంచీ 24వ తేదీ లోపు కాలేజీల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాలి.24 నుంచీ క్లాసులు ప్రారంభమవుతాయని కన్వీనర్ సీతాకుమారి తెలిపారు.

## టీటీడీ ఈవోకు ధర్మకర్తల మండలి అభినందన



టీటీడీ ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్‌కు టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న ఈవో సింఘాల్‌ను బోర్డు స్వాగతించింది. అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. గతంలో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌కున్న అనుభవం భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో, టీటీడీని అభివృద్ధి దిశగా నడిపించడంతో ఉపయోపడుతుందని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. మరోసారి ఈవోగా అవకాశం ఇచ్చిన సీఎంకు సింఘాల్ కృతజ్ఞతలు తెలిపారు. బోర్డు సలహాలు, సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఛైర్మన్, బోర్డు సభ్యుడు శాంతారాం ఈవోను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా విజయభాస్కరరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఎస్వీయూలోనే పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి, 1992 లో ఫిజిక్స్ అధ్యాపకుడిగా చేరారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా, ఎస్వీయూ రీసెర్చ్ డీన్‌గా, విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించారు. ఈయన పర్యవేక్షణలో 30 పీహెచ్‌డీలు, 10 రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. సుమారు 200 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు. 104వ ఇస్కా కార్యదర్శిగా సేవలందించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## శ్రీవారి సర్వదర్శనానికి 12గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తుతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,066**

**తలనీలాలు సమర్పించినవారు: 24,620**



# సారీ.. శనేశ్వరా..!

- శని భగవానుడినీ వదలని రాజకీయ గ్రహణం
- అది విష్ణుమూర్తి అంటూ కరుణ దుష్ప్రచారం
- అభయ శనేశ్వరుడని చెప్పినా వినిపించుకోని వైనం



విగ్రహం వద్ద కరుణాకరరెడ్డి

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాల సమీపంలో రెండు దశాబ్దాల కిందటి నుంచి పడున్న ఓ అసంపూర్తి శనేశ్వర విగ్రహానికి వైసీపీ రాజకీయరంగు పులిమింది. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి హఠాత్తుగా మంగళవారం ఆ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పాదపీటికకు మొక్కి కళ్లకద్దుకున్నారు. కొబ్బరికాయ కొట్టి కోనేటిరాయుడా.. ఏమిటీ నీకీ దుస్థితి? హైందవ ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని అంటూ ఆవేదనచెందారు. విగ్రహం పడేసిన చోట మూత్ర విసర్జన చేస్తున్నారని, మద్యం తాగుతున్నారని ఆరోపించారు. విష్ణుమూర్తికి జరిగిన అపచారానికి హిందూ సంఘాలన్నీ ఏకంకావాలంటూ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఘోరాలు జరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేశారు. ఈ విషయం తెలిసి టీడీపీ నాయకులు వాస్తవాలను ప్రజలకు చెప్పాలని ఘటనా స్థలికి వెళ్లారు. అది విష్ణుమూర్తి కాదని, అభయ శనేశ్వర విగ్రహమని రుజువు చేశారు. రెండు దశాబ్దాలుగా అక్కడుందని అన్నారు. అయినా, కరుణాకర్‌రెడ్డి మాత్రం సవరించుకోలేదు. వైఖానస ఆగమశాస్త్రం తెలియని వాళ్లు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అది ముమ్మాటికీ విష్ణుమూర్తి రూపమేనని పునరుద్ఘాటించారు. మరోవైపు, మధ్యాహ్నం తిరుమలలో టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో సభ్యులు తీవ్రంగా స్పందించారు. టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు హెచ్చరించారు.

### శనేశ్వరుడినీ వదలవా?: టీడీపీ

రెండు సార్లు ఎమ్మెల్యేగా, టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తికి ఎప్పటినుంచో పడున్న అసంపూర్తి శనేశ్వర విగ్రహం గురించి తెలియదా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఊకా విజయకుమర్, జేబీ శ్రీనివాస్ తదితరులు ఈ విగ్రహాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. నాస్తికుడైన కరుణాకర్‌రెడ్డి పదే పదే టీటీడీపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కుటుంబసమేతంగా కొండకు వెళ్లి తలనీలాలు ఇచ్చి, స్వామిని వేడుకుంటే తప్ప మీపాపం పోదని మండిపడ్డారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

### ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి చనిపోవడంతో ఆ విగ్రహాన్ని వదిలేశాం



మీడియాతో మాట్లాడుతున్న గురుస్వామి

ఈ ఆరోపణల నేపథ్యంలో విగ్రహాన్ని తయారు చేసిన కన్నయ్యచారి కుమారుడు గురుస్వామి తిరుమల చేరుకున్నారు. టీటీడీ బోర్డుకు వివరాలు వెల్లడించారు. మీడియాతోనూ మాట్లాడారు. 'దాదాపు 22 ఏళ్ల కిందట మాకు రాయలచెరువు రోడ్డులో విగ్రహాల తయారీ షెడ్డు ఉండేది. ఆ సమయంలో బెంగళూరుకు చెందిన వ్యక్తి శనీశ్వరుడు విగ్రహం కావాలని రూ.2 లక్షలు, డ్రాయింగ్ ఇచ్చారు. పది చేతులు, కాకికి బదులుగా సింహం పెట్టాలని కోరాడు. తర్వాత ఆ వ్యక్తి చనిపోయాడు. మా పరిస్థితి కూడా బాగాలేకపోవడంతో అక్కడి స్థలాన్ని విక్రయించి అన్ని విగ్రహాలతో అలిపిరిలోని శిల్ప క్వార్టర్స్‌కు వెళ్లాం. 2003లో అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్‌మైన్ పేలుడుతో మమ్మల్ని అక్కడ్నుంచి ఖాళీ చేయించారు. ఆ సమయంలో చిన్నచిన్న విగ్రహాలు తీసుకున్నామే తప్ప, ఈ భారీ శనీశ్వరుడి విగ్రహాన్ని అక్కడే వదిలేశాం. 22 ఏళ్లగా ఈ విగ్రహం అక్కడే ఉంది. చాలాసార్లు తరలించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు' అని స్పష్టతనిచ్చారు.

### శనీశ్వరుడికి, మహావిష్ణువుకు తేడా తేలీదా?

#### ● టీటీడీ సభ్యుల ఆగ్రహం

శనీశ్వరుడికి, మహావిష్ణువు తేడా తెలియదా అంటూ భూమనను టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. 'ఓ రాజకీయ నిరుద్యోగి. పాత చెప్పు ఇవ్వండి ఆ నల్లరాయిని కొడతా అన్న వ్యక్తి. టీటీడీ ఛైర్మన్‌గా, బోర్డు సభ్యుడిగా పనిచేసిన కరుణాకరరెడ్డి అబద్ధాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారారు' అని ఆగ్రహించారు. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రెండుసార్లు భూమన టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ ఈ విగ్రహం అక్కడే ఉందన్నారు. అప్పుడు పూజలు చేయకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఆయనే ఈ విగ్రహం సమీపంలో మద్యం బాటిళ్లు, పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లు వేయించినట్లు అనుమానాలున్నాయన్నారు. హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా చిత్రీకరించేందుకు కరుణాకరరెడ్డి ముందస్తు ప్రణాళికతోనే ఈ ఆరోపణలు చేశారన్నారు. 'నువ్వు ఇంట్లో ఆచరించే మతవిశ్వాసాలు వేరు. ఉనికి కోసం బయట ఆచరించే మతం వేరు. కేవలం ధనార్జన కోసం టీటీడీని, శ్రీవారిని ఉపయోగించుకున్న భక్తిలేని వ్యక్తివి' అంటూ మరో సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. కరుణాకరరెడ్డి రోజురోజుకు దిగజారిపోయి మాట్లాడుతున్నారంటూ డాలర్స్ దివాకర్‌రెడ్డి విమర్శించారు. విష్ణుమూర్తికి మీసాలు ఉండవనే విషయాన్ని భూమన గ్రహించాలని పనబాక లక్ష్మి సూచించారు.

### భూమనపై కేసు నమోదు

కాగా,టీటీడీపై దుష్ప్రచారం చే స్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ టీటీడీ డీఈఈ గోవిందరాజులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించడం ద్వారా సమాజంలో అల్లకల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు భూమనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. కాగా, టీటీడీ ఫిర్యాదు నేపథ్యంలో భూమన మరో వీడియోను విడుదల చేశారు. శనీశ్వరుడి విగ్రహానికి శంకుచక్రాలు ఎందుకుంటాయని ప్రశ్నించారు. ఒకవేళ శనీశ్వరుడి విగ్రహం అనుకున్నా దేవుడే కదా? ఎవరో తెచ్చి పడేస్తే తీసివేయాల్సిన బాధ్యత టీటీడీకి లేదా? అని ప్రశ్నించారు. తనకు జైలు కొత్తకాదని స్పష్టం చేశారు.

## రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో తీవ్ర జాప్యం

- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు
- అర్ధాంతరంగా పలు లోకల్ రైళ్ల రద్దు



గడ్డర్ల మార్పు పనులు చేస్తున్న రైల్వే సిబ్బంది

తడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడవగా, మరికొన్ని రైళ్లను అర్ధాంతరంగా రద్దు చేశారు. చెన్నై - గూడూరు మార్గంలోని తడ - సూళ్లూరుపేట స్టేషన్ల మధ్య కాళంగి నదిపై ఉన్న బ్రిడ్జికి ఇనుప గడ్డర్ల స్థానంలో సిమెంట్ గడ్డర్ల ఏర్పాటు చేయాలని సదరన్ రైల్వే అధికారులు నిర్ణయించారు. సోమవారం అర్ధరాత్రి 1.10నుంచి మంగళవారం ఉదయం 9.10 వరకు పనులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పలు రైళ్లను పూర్తిగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.సోమవారం అర్ధరాత్రి మొదలైన పనులను ఉదయం 9.10కి పూర్తి చేయాల్సి ఉండగా, మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగించారు. దీంతో చెన్నై - విజయవాడ మధ్య నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే లోకల్ రైళ్లు చెన్నై - ఎలావూరు మధ్య నడిచాయి. చెన్నై సెంట్రల్ నుంచి లక్నో వెళ్లే లక్నో ఎక్స్‌ప్రెస్, విజయవాడ నుంచి చెన్నైకు వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై సెంట్రల్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రత్యేక రైలు 2.40 నిమిషాలు ఆలస్యం కాగా, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 10 గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు 2 గంటలు ఆలస్యంగా వెళ్లింది. మరికొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు తడ, ఎలావూరు, గుమ్మిడిపూడి, పోలిరెడ్డిపాళెం, దొరవారిసత్రం, నాయుడుపేట, పెద్దపరియ స్టేషన్లలో గంటల కొద్ది నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నాయుడుపేటలో ఆగిఉన్న పినాకిని ఎక్స్‌ప్రెస్

### శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతో పాటు పూజా సామగ్రిని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజాసామగ్రి తీసుకొస్తున్న టీటీడీ ఛైర్మన్, ఈవో తదితరులు

## అడవిలో మృతులు తమిళనాడువాసులు

- తాజాగా గోతిలో కనిపించిన ఇద్దరు చిన్నారుల శవాలు
- భార్య, పిల్లల మృతదేహాలను గుర్తించిన భర్త
- నలుగురినీ ఎవరో హత్య చేసినట్లు అనుమానం?



కలై సెల్వన్ - జయమాల (ఫైల్‌ఫొటోలు)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాకాల వారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం బయటపడిన మృతదేహాలు తమిళనాడుకు చెందిన వారివిగా నిర్ధారణ అయింది. ఆదివారం సాయంత్రం ఈ అడవిలో ఓ పురుషుడు శవం చెట్టుకు వేలాడుతుండటం, ఓ మహిళ మృతదేహం సమీపాన పడి ఉండటం, అక్కడే పూడ్చిపెట్టిన రెండు గోతులను పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. గోతుల్లో ఇద్దరు చిన్నారులను పూడ్చిపెట్టి ఉంటారని పోలీసులు భావించారు. సోమవారం పురుషుడు, మహిళల శవాల పోస్టుమార్టం, ఖనన ప్రక్రియతో చీకటి పడిపోయింది. ఈక్రమంలో మంగళవారం పోలీసులు అడవికి చేరుకుని రెండు గోతులను కొంతమేర తవ్వారు. గోతిలో మొబైల్ ఫోన్, డెయిరీ మిల్క్ చాక్లెట్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, నగదుతో పాటు చిన్నారుల మృతదేహాలున్నట్లు గుర్తించారు. సాయంత్రం కావడంతో గోతులను పూర్తిగా తవ్వలేకపోయారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో బుధవారం ఉదయం పూర్తిగా తవ్వి, మృతదేహాలను వెలికి తీయనున్నట్లు పోలీసులు తెలిపారు.

**మందుల చీటీనే క్లూ**

రెండు రోజుల క్రితం సంఘటనా స్థలం వద్ద మందుల చీటీ పాకాల పోలీసులకు దొరికింది. ఈ క్లూ ఆధారంగా వారు దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రిస్క్రిప్షన్ తమిళనాడులోని తంజావూరు వైద్యుడు రాసిందిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సదరు వైద్యుణ్ని ఆరా తీశారు. కలైసెల్వన్ అనే వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక తన దగ్గర వైద్యం పొందుతున్నాడని ఆ వైద్యుడు తెలిపారు. ఈఏడాది జూలైలో తిట్టచ్చేరి పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని వెంకటేశ్ అనే వ్యక్తి తన భార్య జయమాల, కుమార్తెలు హర్షిణి(7), దర్శిణి(3) కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు కుటుంబ పోషణ కోసం కువైట్‌లో ఉండేవాడు. అడవిలో శవాల సమాచారంతో అతడ్ని తమిళనాడు పోలీసులు మంగళవారం తీసుకొచ్చారు. సంఘటనా స్థలంలో ఉన్నది తన భార్య జయమాల మృతదేహమని వెంకటేష్ గుర్తించారు. మరో మృతుడు తన సమీప బంధువు కలైసెల్వన్(37)గా పేర్కొన్నారు. దీంతో మృతులెవరనేది నిర్ధారణ అయింది. మృతులకు నోట్లో గుడ్డలు కుక్కి, పార్శిల్ టేప్ చుట్టినట్లు ఉండటంతో పోలీసులు హత్యగానే భావిస్తున్నారు. లోతైన దర్యాప్తులో వీరి మృతికి సంబంధించి మిస్టరీ వీడుతుందని చెబుతున్నారు.

## మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్

- ఈసారి లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు..
- ఫేక్ మెయిల్‌గా తేల్చిన బీడీ టీమ్



లిటిల్ ఏంజెల్స్ స్కూలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మీ హోటళ్లలో బాంబులు పెట్టాం.. పేల్చేస్తామంటూ గతేడాది అక్టోబరు 24న మొదలైన బెదిరింపు ఈ మెయిల్స్ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా తిరుపతి నగరం రైల్వే కాలనీలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు ఆ తరహా మెయిల్ వచ్చింది. ఈ స్కూల్‌లో బాంబులు పెట్టామని త్వరలో పేలతాయంటూ మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తమిళనాడు నుంచి రజాక్ హాట్ మెయిల్ నుంచి స్కూల్ మెయిల్‌కి సందేశం పంపారు. దీనిపై పాఠశాల కరస్పాండెంట్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ అజిత, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి బాంబు డిస్పోజల్ పరికరాలతో పాఠశాలతో పాటు ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, ప్రాంగణమంతా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందీ పరిశీలించారు. దాదాపు గంట పాటు జరిగిన తనిఖీల్లో ఎలాంటి బాంబులు లేవని, ఫేక్ మెయిల్‌గా తేల్చారు. దీనిపై అలిపిరి సీఐ కేసు నమోదు చేశారు.కాగా, 11నెలల కిందట తొలుత నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆ తర్వాత అక్టోబరు 27న ఇస్కాన్ టెంపుల్‌కు, మరో ఐదు హోటళ్లకూ.. డిసెంబరు 13న వ్యవసాయ కళాశాలకు.. ఈ ఏడాది మార్చి 21న కలెక్టరేట్‌కు.. మే 28న మళ్లీ కలెక్టరేట్‌కు.. వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. కొంతకాలం ఆగాక.. మళ్లీ బాంబు మెయిల్ వచ్చింది.

### డిజిటల్ మారథాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 రాయబారి డిజిటల్ మారథాన్'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుత డిజిటల్ ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. 18-35 ఏళ్ల మధ్య వయస్కులు తాము చేపట్టిన కార్యక్రమాలపై 120సెకన్ల నిడివి గల వీడియోలను సొంత సామాజిక మాధ్యమాల్లో చూపించి అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్టు చేయాలన్నారు. ఉత్తమమైన మూడింటిని ఎంపికచేసి రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేల బహుమతి ఇస్తారన్నారు. 9మంది విజేతలకు ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్ గా సత్కరిస్తారు. ఆసక్తి గల వారు 'ఆంధ్రయువసంకల్ప్‌కామ్' వెబ్‌సైట్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848543976 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్ - సుబ్రమణ్యం నాయుడు (ఫైల్ ఫొటో)

## డీసీఎంఎస్ ఛైర్మన్ కన్నుమూత

- ఎమ్మెల్యేలు, టీడీపీ శ్రేణుల నివాళులు

చంద్రగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెకు చెందిన డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు మంగళవారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజులుగా శ్వాసకోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అసువులు బాశారు. ఈయన మృతదేహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరుండి చెన్నై నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం జంక్షన్‌కు మృతదేహం చేరుకుంది. అక్కడ్నుంచి మండలంలోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ ద్వారా చంద్రగిరి మీదుగా గడ్డంవారిపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈయన గతంలో రెండు పర్యాయాలు మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఐతేపల్లె సింగిల్‌విండో ఛైర్మన్‌గా పనిచేసి, ప్రస్తుతం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఉన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్యకర్తలకు అండగా ఉన్నారు. పార్టీ విజయానికి కృషి చేశారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని నేతలు పేర్కొన్నారు. చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, నేతలు కుమారరాజారెడ్డి, ముడిపల్లె సురేష్‌రెడ్డి, పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, శుభగిరి, శ్రీధర్‌నాయుడు, అనిమిని మధు, దేవానందనాయుడు తదితరుల నివాళులర్పించారు.

### జలజల జాలువారంగ..!





తిరుపతిలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో శేషాచల కొండల్లో నుంచి మాల్వాడిగుండం ప్రవహించింది. కపిలతీర్థంలోకి జలజలమంటూ జలపాతం దూకుతూ కనువిందు చేసింది.

## ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ మస్తాన్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీపీ తంబిరెడ్డి తనూజాశివా రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మపాళెం సర్పంచి మస్తాన్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై ప్రజలు నిలదీస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ చాలామందికి జమ కాలేదని, దీనిపై ఎవరిని అడగాలో తెలియక రైతులు ఇబ్బందిపడుతున్నారని, వీఆర్వోలు, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. తమ గ్రామంలో ఆర్బీకే ఏడాదిన్నరగా మూతవేసి ఉందన్నారు. ఉపాధి కూలి పనులు చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు అడ్డుకుంటున్నారని, దీనికి పరిష్కారం చూపించాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథం, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జెండా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి జెండా పండుగ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జెండా ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న ఆంజేయ స్వామి జెండా ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చకూడదన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఉత్సవాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షాజహన్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి సునీత సేవాసంస్థ కృషి చేస్తుందని సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, వారు ఆర్థిక స్వాలంబన సాధించేలా తోడ్పాటునందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్ కృషి చేస్తుందని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆవిర్భావదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్ అనేక ఉద్యమాలను సాగించిందన్నారు. తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో ఉన్న ఉద్యోగుల మీద అధిక ఒత్తిడి పడుతోందన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన బస్సు సర్వీలను ఏర్పాటు చేయడంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అనంతరం ఎస్‌డబ్ల్యుఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎం లక్ష్మి, శ్రీనివాసులు, శేషయ్య, నారాయణ, వాసులు, రఘురామ్, శ్రీధర్, బీవీరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల వేతనాలు చెల్లించండి

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు వేతనాలు చెల్లించాలంటూ కూలీలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక అరుంధతీయవాడవాసులు మాటాడుతూ క్రమం తప్పకుండా పనులు చేస్తున్నా ఐదు వారాలుగా వేతనాలు చెల్లించడంలేదన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు.

## యూరియా గోదాములపై విజిలెన్స్ దాడులు



యూరియా గోదామును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని పలు యూరియా గోదాములపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. విజిలెన్స్ ఏవో రామాంజనేయరెడ్డి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ వెంకటాద్రి స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని, ఎక్కడైనా తేడాలు వస్తే సంబంధిత ఎరువుల దుకాణ డీలర్లపై కేసుల నమోదుతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఐటీఐ ప్రవేశాలకు గడువు పొడిగింపు

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు బాలికల ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనె 27వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9492751613, 9441859490 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## పర్మిట్ రూములకు లైసెన్స్ ఫీజు చెల్లించాలి

వాకాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం షాపుల నిర్వాహకులు నెలాఖరులోగా పర్మిట్ రూములకు ఫీజు చెల్లించాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి అన్నారు. మంగళవారం వాకాడు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఉన్నారు.

## డ్రోన్‌తో నిఘా

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐఐహెచ్‌టీ, వల్లివేడు క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ నిఘా వేశారు. బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు.

## ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) సొసైటీ అభినందన సభకు కోళ్లమిట్ట ప్రాంతంలోని మన్నెముత్తేరి సర్కిల్ వద్ద తాను ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను మరో వర్గానికి చెందిన వ్యక్తులు చించేశారని రైతుసేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ బాలచంద్ర కిషోర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పూరిగుడిసె దగ్ధం

తడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. మండల పరిధిలోని ఇరకంకుప్పం దీవిలో ఒంటరిగా నివాసం ఉంటున్న చిన్నపొన్నుకు చెందిన పూరిగుడిసెలో మంగళవారం మధ్యాహ్నం సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు అంటుకుంది. గాలులు వీస్తుండటంతో మంటలు వేగంగా వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే గుడిసె మొత్తం కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి.

# ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్టు

**ఐదుగురి పట్టివేత ● 11 బైక్‌ల స్వాధీనం**



పట్టుబడ్డ బైక్‌లతో సీఐ మురళీకృష్ణ, సిబ్బంది

తడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి, 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల తడ ప్రాంతంలో బైక్‌లు చోరీకి గురవుతుండటంతో పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులో తీసుకొని విచారించగా, బైక్‌లను చోరీ గుట్టురట్టైంది. పట్టుబడ్డ ఐదుగురిలో రౌడీషీటర్ కుదిరి సాయి విఘ్నేష్ అలియాస్ బబ్లు, అలియాస్ కేఎఫ్‌తో పాటు వరదయ్యపాళెం మండలం తొండూరు సొసైటీకి చెందిన పాళెంగోపాల్ అలియాస్ ప్రశాంత్, తడ మండలం వేనాడు గ్రామానికి చెందిన వెట్టి రాకేష్ అలియాస్ రాఖీ, సత్యవేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తొండా మునిశేఖర్ అలియాస్ గన్, సూళ్లూరుపేట మండలం కొమ్మినేనిపల్లికి చెందిన బందిలి సూర్యనారాయణ అలియాస్ మిరపకాయలుగా గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని, ప్రస్తుతం వారు మరో కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్నారని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు.

# అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైతు శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. సహకార సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయడంతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతోంద న్నారు. రైతులకు కావాల్సిన యూరియాను పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నాయుడుపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రభాకర్ నాయుడు, డైరెక్టర్లుగా పరంధామయ్య, నారాయణ, అన్నమేడు సొసైటీ అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, డైరెక్టర్లుగా నాగరాజు, మునస్వామి, ఓజిలి మండలం కుందాం సొసైటీ అధ్యక్షుడిగా పురుషోత్తమరాజు, డైరెక్టర్లుగా బాలగురునాథం, వెంకటయ్య, కురుగొండ సొసైటీ అధ్యక్షుడిగా అంకయ్య, డైరెక్టర్లుగా మల్లికార్జునరెడ్డి, రవీంద్ర రాజు, పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు సొసైటీ అధ్యక్షుడిగా కేవీ నాయుడు, డైరెక్టర్లుగా గోపాలకృష్ణ, రామకృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట, సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు రఫీ, సుధాకర్‌రెడ్డి, విజయకుమార్ నాయుడు, అశోక్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, మురళీకృష్ణారెడ్డి, శివకుమార్ మొదలియార్, గోపాలకృష్ణ, ప్రభాకర్ నాయుడు, మైలారి రాజశేఖర్, మల్లికార్జునరెడ్డి, నాగేంద్రరెడ్డి, పసల గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంచుకోవాలి: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సోలార్ విద్యుత్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన సోలార్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వినియోగదారులకు బిల్లులను ఆదా చేసుకునేందుకు సోలార్ వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు రాయితీ అందజేస్తున్నాయన్నారు. ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, మోహన్, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు: యూటీఎఫ్



నాయుడుపేటలో యూటీఎఫ్ రణభేరి జాత

నాయుడుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌ఎస్ ప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, సమస్యలను పరిష్కరించాలంటూ యూటీఎఫ్ తిరుపతి నుంచి చేపట్టిన రణభేరి మంగళవారం నాయుడుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. అలాగే 12వ పీఆర్సీని నియమించడంతో పాటు 30శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ముత్యాలురెడ్డి, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, నిర్మల, కంజర్ల శేఖర్, మధు, విజయశ్రీ, సుబ్బారావు, శ్రీనివాసులు, శివప్రసాద్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట:** యూటీఎఫ్ రణబేరికి సూళ్లూరుపేట మండలంలోని మన్నారుపోలూరు హైస్కూల్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హోలిక్రాస్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాయుడు, జీజే రాజశేఖర్, నిర్మల, ప్రభాకర్ మధు, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరి టౌన్:** యూటీఎఫ్ రణభేరి ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో చేసిన ప్రయోగాలు దుష్పరిణామాలకు దారి తీశాయని, వాటిని కూటమి ప్రభుత్వం సరిదిద్దాలన్నారు. అలాగే పీఆర్సీని నియమించడంతో పాటు 29 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమారస్వామి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవరాల నిర్మల, రామచంద్రయ్య, ఉదయ్ కుమార్, మధు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకే పీ-4

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం సీఎం చంద్రబాబునాయుడు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో పీ-4 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం అందరి సహకారంతో విద్య, ఉపాధి తదితర అంశాలను అభివృద్ధి పరిచేలా పలువురిని భాగస్వాములను చేస్తూ పీ-4 కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా తకెళ్లపాడు గ్రామాని చెందిన రంపతోటి శ్రీనివాసరావు (31) శ్రీకాళహస్తి వైపు మోటార్ బైక్‌పై వెళ్తుండగా తాళ్వాయిపాడు సర్వీస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. హెల్మెట్ తల నుంచి విడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడికే మృతి చెందాడు. ఎస్‌ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. డిపో వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సాల్మన్, శేఖర్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినాన్ని పురష్కరించుకుని బుధవారం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి కోరారు.

## రాజరాజేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిట్టేడులో రాజరాజేశ్వరి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం జరిగింది. స్థానిక నాగేంద్ర ఆచార్య మఠం ప్రతినిధి చిదానంద వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

## మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు

నాయుడుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలను నాయుడుపేటలో మంగళవారం బీజేపీ నాయకులు డాక్టర్ రంగినేని కృష్ణయ్య, బొల్లకాయల విజయకుమార్, ఆట చెంచుకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం, అమరావతి రామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, పొట్లపూడి శ్రీనివాసులు, వీరయ్య, రవీంద్ర, చంద్ర పాల్గొన్నారు.

## చిల్లకూరు సొసైటీ చైర్మన్‌కు సన్మానం



కేవీ నాయుడిని సన్మానిస్తున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు సొసైటీ ఛైర్మన్ కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు(కేవీ నాయుడు)ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం నాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో కేవీ నాయుడు చిల్లకూరు సొసైటీ ఛైర్మన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎద్దల నరేంద్రరెడ్డి శాలువ కప్పి సన్మానించారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతోటి మురళి, రమణ, భరత్, సునీల్, మద్దాలి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఈవో సనత్‌కుమార్

చిల్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని డీవైఈవో సనత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన వారిని డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శశశంకర్, సుధీర్, ఎంఈవో రవూఫ్, హెచ్‌ఎం జ్యోతి, పీడీ శ్రీనివాసులు, మల్లికార్జున్, బుజ్జిబాబు, వాసుదేవయ్య పాల్గొన్నారు.

## మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఎవీకేఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. తహసీల్దారు జయజయరావు, ఎంఈవోలు మస్తానయ్య, శిరీష పోటీలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, దారా సురేష్, షంషుద్దీన్ పరుగుపందెంలో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు.

## భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు తిరుపతి వ్యవసాయశాఖ ఏవో శ్రీనివాసులు, వెంకటగిరి ఏవో సుజాత భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా నానో యూరియా, నానో డీఏపీ, బయోఫెర్టిలైజర్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, వ్యవసాయశాఖ అధికారులు పుష్పావతి, కల్యాణబాబు, సుజాత, రాజీవన తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో మంగళవారం కేవీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మ్యాన్‌కైండ్ ఫార్మసీ సహకారంతో వృద్ధులకు నిత్యావసరాలను, పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ కీర్తి, శేషాద్రి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.